

నా భార్య ఎక్కువ సమయం ఫోన్‌లో మాట్లాడుతోంది. అందువల్లే మా ఇద్దరి మధ్య గొడవలు..

..ఓ భర్త ఫిర్యాదు



భర్త నా మాటకు విలువ ఇవ్వట్లేదు. వాళ్ల అమ్మా నాన్న, అక్కచెల్లెళ్ల మాట వింటున్నారు.

..ఓ భార్య ఫిర్యాదు

సర్దుకుపోతే సమస్య చిన్నదే..!

- చిన్నచిన్న కారణాలకే గొడవలు
- పోలీసు స్టేషన్లు, కోర్టులను ఆశ్రయిస్తున్న వైనం
- రాజీ పడుతోంది కొందరే.. విడాకులకే మొగ్గు

దంపతుల మధ్య పెరుగుతున్న మనస్పర్థలు



పుట్టపర్తి రూరల్/కొత్తచెరువు జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఏడడుగుల బంధంతో ఒక్కటైన జంటలు చిన్నిచిన్న కారణాలతో విడిపోతున్నాయి. ఇటీవల దంపతుల మధ్య కలహాలతో పోలీసు స్టేషన్లు, కోర్టు గుమ్మం తొక్కుతున్న ఘటనలు విస్మయ పరుస్తున్నాయి. ఉన్నత చదువులు పూర్తి చేసి, ఉద్యోగాలు చేస్తున్న వారు కూడా నూరేళ్ల బంధాన్ని తెంచుకుంటున్నారు. పెళ్లయిన రెండు, మూడు ఏళ్లకే విడిపోతామని తెగేసి చెబుతున్న జంటలు ఇటీవల అధికమవుతున్నాయి. దంపతుల మధ్య తగాదాలను పరిష్కరించడానికి కౌన్సెలింగ్ ఇస్తున్నా.. వారు విడిపోవడానికి మొగ్గు చూపుతున్నారు. దీంతో (మిగతా 6లో..)

రాజీ పడుతోంది.. కొందరే..!

మహిళా పోలీసు స్టేషన్లు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో నిర్వహించే కౌన్సెలింగ్ ద్వారా కొందరే రాజీ అవుతున్నారు. పోలీసులు కౌన్సెలింగ్‌తో కొన్ని జంటలు కలుస్తున్నా.. ఎక్కువమంది విడిపోవడానికే మొగ్గు చూపుతున్నారు. కొత్తగా వివాహం చేసుకున్న వారు 30 ఏళ్లలోపు వారు ఎక్కువ మంది విడాకులకు దరఖాస్తు చేసుకుంటున్నారు. ఇందుకు ఒకరినొకరు అర్థం చేసుకోకపోవడం, గౌరవభావం, ఉమ్మడి కుటుంబాలపై ప్రేమాభిమానాలు లేకపోవడం ప్రధాన సమస్యలుగా కనిపిస్తున్నాయి.

నీరు వృథా..రైతు వ్యథ

- కోతకు గురైన సప్లై చానళ్లు, చెక్‌డ్యాంలు
- మరమ్మతులను పట్టించుకోని అధికారులు
- తప్పని తాగు, సాగు నీటి ఇబ్బందులు

మడకశిర, జూలై 12(ఆంధ్రజ్యోతి): కరువుకు ఆలవాలమైన మడకశిర నియోజకవర్గంలో నీరు నిల్వ చేసుకునే వనరులు దెబ్బతినడంతో వర్షపు నీరు వృథాగా పోతోంది. దశాబ్దం కిందట గుడిబండ, రొళ్ల మండలాల్లో రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన చెక్‌డ్యాంలు, కుంటలు నాసిరకంగా ఉండటంతో బాగా దెబ్బతిన్నాయి. కొన్ని కోతకు గురికాగా, మరికొన్నింటిలో పూడిక పేరుకుపోయింది. దీంతో వాన నీరు వృథాగా పోతోంది. అధికారులు స్పందించి వాటిని మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

రూ.2 కోట్ల నిధులు వెనక్కి

పదేళ్ల కిందట అమరాపురం మండలంలో నాచేపల్లి సప్లైచానల్, గుడిబండ మండలంలో మోరుబాగల్ సప్లైచానళ్ల నుంచి నీటిని మడకశిర ప్రాంతంలోని చెరువులకు మళ్లించేందుకు రూ.2 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అయితే రెండు మార్లు పిలిచినా



కొడగార్లగుట్ట సప్లైచానల్‌లో పెరిగిన పిచ్చి మొక్కలు

టెండర్లు ఖరారు కాకపోవడంతో ఆ నిధులు వెనక్కు మళ్లాయి. దీంతో నాచేపల్లి సప్లైచానల్ నుంచి కర్ణాటకలోని దొడ్డబాణగెర చెరువుకు నీరు వెళ్తోంది. ఆ నీటిని మళ్లిస్తే తమ్మడేపల్లి చెరువుకు జలకళ వస్తుంది. మోరుబాగల్ సప్లైచానల్ నీరు కూడా మళ్లించకపోవడంతో దిగువ ప్రాంతంలోని కర్ణాటక చెరువులకు నీరు వెళ్తున్నాయి. రొళ్ల మండలం హొట్టేబెట్ట నుంచి గంగలవాయిపాళ్యం, గోవిందాపురం మీదుగా వచ్చే నీరు మడకశిర చెరువులకు మళ్లించేందుకు పదేళ్ల కిందట అంచాలు రూపొందించి, ప్రతిపాదనలు పంపారు. నిధులు మంజూరు కాకపోవడంతో ప్రతిపాదనలకే పరిమితమైంది. ఆ సప్లైచానల్ నీరు మడకశిర చెరువుకు మళ్లిస్తే కొద్ది పాటి వర్షం వచ్చినా చెరువుకు నీరు చేరుతుంది. దీంతో భూగర్భజలాలు పెరిగి నీటి సమస్య పరిష్కారం కావడంతో పాటు మడకశిర పట్టణానికి తాగునీటి సమస్య తీరుతుంది. మూడేళ్ల కిందట అగళి మండలంలో స్వర్ణముఖి నది ఉధృత ప్రవాహంతో సప్లై చానళ్లు దెబ్బతిన్నాయి. చెక్‌డ్యాంలు కోతకు గురయ్యాయి. దీంతో వాన నీరు వృథాగా పోయే పరిస్థితి నెలకొంది. ఈ సప్లైచానళ్లు, చెక్‌డ్యాంలు మరమ్మతులు చేసి, నీటి సంరక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. రొళ్ల మండలం కొడగార్లగుట్ట సప్లైచానల్‌లో పూడిక పేరుకుపోయి కంపచెట్లు పెరగడంతో నీరంతా వృథా అవుతోంది. పూడికను తొలగించి కంపచెట్లు తొలగిస్తే వర్షపు నీరు రొళ్ల చెరువుకు చేరతుంది. దీంతో ఆ ప్రాంతాలలో తాగు, సాగు నీటి సమస్య పరిష్కారం అవుతుందని రైతులు పేర్కొంటున్నారు.



మూడేళ్ల కిందట స్వర్ణముఖి నది కోత



పూడిక తొలగిస్తే చెరువుకు నీరు

కొడగార్లగుట్ట సప్లైచానల్‌లో పూడిక, కంపచెట్లు తొలగిస్తే కాలువ ద్వారా రొళ్ల చెరువుకు పుష్కలంగా నీరు చేరుతాయి. పూడిక , కంపచెట్లను తొలగించకపోవడంతో వాన నీరు వృథాగా పోతోంది. వర్షాలు కురిసినా రొళ్ల చెరువుకు అరకొర నీరు వస్తున్నాయి. దీంతో తాగు, సాగు నీటికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అధికారులు కాలవలో పూడికను తొలగించి, కంపచెట్లను తొలగించాలి.

- రైతు మారన్న, కొత్తపాళ్యం

పనులు చేపడతాం

కాలువల నుంచి చెరువులకు నీరు అందించేందుకు గతంలో ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాలేదు. కొన్నింటికి నిధులు మంజూరైనా, పనులు చేయడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లాయి. ఇప్పుడు మళ్లీ నిధులు మంజూరైతే వెంటనే పనులు చేపడతాం.

- శ్రీనివాసులు, ఇరిగేషన్ ఏఈ

లేపాక్షి శిల్పకళ అద్భుతం

- మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కుమార్తె సురభివాణి

లేపాక్షి, జూలై 12(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన లేపాక్షి దుర్గావీరభద్ర స్వామి ఆలయంలో శిల్పకళ అద్భుతంగా ఉందని భారత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కుమార్తె, తెలంగాణ ఎమ్మెల్సీ సురభి వాణి అన్నారు. ఆలయాన్ని ఆమె శనివారం సందర్శించారు. అర్చకులు ఆలయ చరిత్ర, ఏడుశిరస్సుల నాగేంద్రుడు, వేలాడే స్తంభం, అర్థాంతరంగా ఆగిన కల్యాణమండపం, సీతాదేవి పాదం గురించి ఆమెకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆలయంలో శిల్ప, చిత్రకళ ఎంతో అద్భుతంగా ఉందని, ఆనాటి శిల్పుల నైపుణ్యానికి ఇది నిదర్శనమని కొనియాడారు. అనంతరం దుర్గా, వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.



ఆలయాన్ని సందర్శిస్తున్న సురభివాణి

అలరించిన ప్రేమామృతధార

పుట్టపర్తి, జూలై 12(ఆంధ్రజ్యోతి): అమెరికా దేశానికి చెందిన సత్యసాయిబాబా భక్తులు ప్రేమామృతధార పేరిట చేపట్టిన భక్తిగీతాల ఆలాపన అలరింపచేసింది. రెండో రోజు శనివారం సాయికుల్వంతు సభామండపంలో అమెరికా భక్తులు వందేళ్ల సత్యసాయి ప్రేమతత్వంపై సంగీత గాన కచేరీ నిర్వహించారు. గంట పాటు భక్తిగీతాలతో భక్తులకు తన్మయత్వం చేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.



పాటలు పాడుతున్న అమెరికా భక్తులు

గండం గట్టెక్కేలా..!

రోడ్డు ప్రమాద బాధితులకు క్యాష్‌లెస్ ట్రీట్మెంట్

- గాయపడినా, మృతి చెందినా ఆర్థిక సాయం
- రెండు పథకాలను అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వం



పెనుకొండ-మడకశిర రోడ్డులో ప్రమాదం (ఫైల్)

హిందూపురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. ప్రమాదాల్లో కొందరు మృతి చెందగా, మరెందరో దివ్యాంగులుగా మారి దుర్భర జీవితం గడుపుతు న్నారు. కుటుంబ సభ్యుల ఆదరణ కూడా కరువై కుంగిపోతున్నారు. ఇలాంటి వారిని ఆదుకోవడానికి కేంద్ర ప్రభుత్వం క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ ఆఫ్ రోడ్ యాక్సిడెంట్స్ విక్టమ్స్, హిట్‌అండ్‌రన్ పేరుతో రెండు పథకాలు తీసుకొచ్చింది. రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందినా, గాయపడినా ఆ కుటుంబానికి ఈ పథకాల ద్వారా ఆర్థిక సాయం అందనుంది.

క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్

రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి తక్షణమే మెరుగైన వైద్య సేవలు అందాల్సి ఉంది. ఒక్కోసారి బాధితుల వద్ద డబ్బు లేకపోవడం సమస్యగా మారుతోంది. దీంతో సరైన సమయానికి వైద్యం అందక కొందరు మరణిస్తుంటే మరి కొందరు అవయవాలు కోల్పోయి దివ్యాంగులుగా మారుతున్నారు. ఇలాంటి వాటి కోసం కేంద్ర ప్రభుత్వం క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ విధానాన్ని తీసుకొచ్చింది. దీని ప్రకారం జాతీయ రహదారిపై ప్రమాదం జరిగి, గుర్తింపు పొందిన ఆస్పత్రుల్లో చేరిన వారికి రూ.1.5 లక్షల మేరకు నగదు రహిత చికిత్స అందనుంది. ఇందు కోసం బాధితులు ఎలాంటి దరఖాస్తు చేసుకోవాల్సిన పనిలేదు. ఆసుపత్రిలో చేరిన వెంటనే చికిత్స పొందవచ్చు. బాధితుడికి సంబంధించిన కొన్ని ఆధారాలు మాత్రమే ఉండాలి.

హిట్ అండ్ రన్

గుర్తుతెలియని వాహనం ఢీకొని మరణించిన వారికోసం హిట్‌అండ్‌రన్ పథకాన్ని కేంద్రం తీసుకొచ్చింది. రోడ్డుపై నడిచి వెళ్తున్న సమయం, లేదా ద్విచక్రవాహనంపై వెళ్తుండగా గుర్తుతెలియని (మిగతా 6లో..)

జైలు స్నేహం.. దొంగ బంధం

- నిత్యానందరెడ్డి ఇంట్లో చొరబడింది పాత నేరగాళ్లు
- ఒకరిని అరెస్టు చేసిన పోలీసులు
- 20 తులాల బంగారం, కారు, బైకు స్వాధీనం
- ఉత్తరాది ముఠా కోసం గాలింపు
- హిందూపురం డీఎస్పీ మహేష్

7

గడువులోగా ప్రీమియం చెల్లించాలి

వాతావరణ బీమాకు 15 వరకే గడువు

ఫసల్ బీమాకు 31 వరకూ..

వరికి ఆగస్టు 15 వరకు..

7

మళ్లీ చదువులమ్మ ఒడిలో..

- కొడిగెనహళ్లిలో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం
- హాజరైన తెలంగాణ చీఫ్ సెక్రటరీ, పీవీ కుమార్తె (వివరాలు 7లో)



పీవీ నరసింహారావు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పూర్వ విద్యార్థులు



నీలాకాశంలో ఎగిరిపోదామా..?

- స్వస్థలాలకు వెళ్లేందుకు సైబీరియన్ పక్షులు సిద్ధం
- పిల్లలకు శిక్షణ ఇస్తున్న తల్లి పక్షులు

వివరాలు 6లో

మారింది పేరు మాత్రమే..!

- పాత పద్ధతిలోనే ఆర్‌ఎస్‌కే సిబ్బంది విధులు
- మాతృశాఖల పరిధిలోకి తెస్తామన్న హామీ బుట్టదాఖలు
- సిబ్బంది క్రమబద్ధీకరణతో నెరవేరని ప్రయోజనం
- ఎప్పటిలాగే పనులు ఒక చోట.. వేతనం మరో చోట
- అస్తవ్యస్తంగా రైతు సేవా కేంద్రం సిబ్బంది పనితీరు

అనంతపురం అర్బన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రం సిబ్బందిని మాతృశాఖల పరిధిలోకి తెస్తామని పాలకులు ఇచ్చిన హామీ బుట్టదాఖలైంది. గత సార్వత్రిక ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే రైతు భరోసా కేంద్రంలో పనిచేసే సిబ్బందిని ఆయా శాఖల ఉన్నతాధికారుల నియంత్రణలోకి తెచ్చి, పాలనను గాడిలో పెడతామని ప్రస్తుత పాలకులు హామీ ఇచ్చారు. ఇటీవల రైతు సేవా కేంద్రం సిబ్బందిని ఇటీవల క్రమబద్ధీకరణ చేశారు. అయితే పంటల సాగు విస్తీర్ణం ఆధారంగా స్థానాలు కేటాయించారేగానీ, వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్ సిబ్బందిని ఆయా శాఖల పరిధిల్లోకి మార్పు చేయలేదు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా కేంద్రాన్ని రైతు సేవా కేంద్రంగా పేరు మార్చారేగానీ పాలన అంతా పాతదే.

అస్తవ్యస్తంగా విధి నిర్వహణ

వైసీపీ హయాంలో రైతు భరోసా కేంద్రం సిబ్బందితో పనులు చేయించేది ఒక శాఖ అధికారులైతే, వారిని నియంత్రణ చేసే అధికారం మరో శాఖకు అప్పగించారు. దీంతో ఆర్బీకే సిబ్బంది పనితీరు అస్తవ్యస్తంగా ఉండేది. ఆర్బీకే సిబ్బంది వేతనం, సెలవుల మంజూరు బాధ్యతలను పంచాయతీ సెక్రటరీకి అప్పగించారు.

పనులు మాత్రం వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్ శాఖల్లో నిర్వహించేలా నిర్ణయించారు. దీంతో విధుల నిర్వహణ గందరగోళంగా ఉండేది. వేతనాలు, సెలవులు మంజూరు చేస్తున్న కారణంగా ఎంపీడీఓ, పంచాయతీ సెక్రటరీ ఇతర రకాల పనులు అప్పగించినా చేయాల్సిన పరిస్థితిని సిబ్బంది ఎదుర్కొన్నారు. నియంత్రణ లేని కారణంగా సిబ్బందితో పనులు చేయించలేక (మిగతా 6లో...)



పుట్లూరు రైతు సేవా కేంద్రం



వీరాపురంలో సైబీరియన్ పక్షులు

నీలాకాశంలో ఎగిరిపోదామా..?

● స్వస్థలాలకు వెళ్లేందుకు సైబీరియన్ పక్షులు సిద్ధం ● పిల్లలకు శిక్షణ ఇస్తున్న తల్లి పక్షులు

చిలమత్తూరు, జూలై 12(ఆంధ్రజ్యోతి): సైబీరియన్ పక్షులు (పెయింటెడ్ స్టార్క్స్) తమ పిల్లలతో సందడి చేస్తున్నాయి. పురిటి కోసం సుదూర సైబీరియా ప్రాంతం నుంచి వచ్చిన ఈ ఎర్రకాళ్ల కొంగలు కొమ్మరెమ్మలపై కిలకిల రావాలతో స్థానికులను అలరిస్తున్నాయి. వీరాపురం గడ్డపై పురుడు పోసుకున్న బుల్లి కొంగలు తమ స్వస్థలాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నాయి. తల్లి ఇస్తున్న శిక్షణతో పిల్ల పక్షులు గాలిలో పైకి ఎగిరేందుకు ప్రయత్నిస్తున్నాయి. కొత్తగా వచ్చిన రెక్కలతో ఒక చెట్టు నుంచి మరో చెట్టుపై వాలిపోతున్నాయి. ప్రతి ఏటా జనవరి రెండో వారంలో ఈ సైబీరియన్ పక్షులు వీరాపురం, వెంకటాపురం గ్రామాలకు పురిటి కోసం వస్తుంటాయి. ఈ ఏడాది జనవరిలో సైబీరియన్ నుంచి విడిది కోసం వీరాపురం వచ్చినప్పుడు పక్షుల సంఖ్య 1500 నుంచి 2000 వరకు ఉండేది. సంతతి పెరగడంతో వాటి సంఖ్య మూడు నాలుగు వేలకు చేరింది. ఇప్పటికే పిల్ల పక్షులకు నడక నేర్పుతున్నాయి. గాలిలో ఎగిరే విధంగా శిక్షణ ఇస్తున్నాయి. ఇంతవరకు గూడులో ఉన్న పిల్లలకు తల్లి పక్షులే ఆహారం సేకరించి అందించేవి. అయితే ఇప్పుడిప్పుడే పిల్ల పక్షులు వాటంతట అవే ఆహారం తెచ్చుకోవడం ప్రారంభించాయి. తల్లి కొంగలు ఆహార సేకరణకు తమతో పాటు పిల్లలను తీసుకెళుతున్నాయి. దూర ప్రయాణానికి పిల్ల పక్షులు శక్తిని సంపాదించుకుంటే స్వస్థలాలకు బయల్దేరడానికి తల్లి పక్షులు సిద్ధమవుతున్నాయి.



వేటకెళ్లేందుకు పిల్లలను సమాయత్తం చేస్తున్న తల్లి పక్షులు



ఎమ్మెల్యే చొరవతో సమ్మె విరమణ



కళ్యాణదుర్గంలోని పంపుహౌస్ వద్ద మోటార్లు ఆన్‌చేస్తున్న శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికులు

కళ్యాణదుర్గం, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చొరవతో శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులు సమ్మెను విరమించారు. కళ్యాణదుర్గంలోని పంపుహౌస్ వద్ద కార్మికులు మోటార్లు ఆన్‌చేసి శనివారం విధులకు హాజరయ్యారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో పనిచేస్తున్న 105 మంది కార్మికులు మాత్రమే సమ్మెను విరమించారు. ఈ ప్రాంతంలో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు, పీఎఫ్ బకాయిలను కాంట్రాక్టర్‌తో చర్చించి త్వరలోనే ఇప్పిస్తానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో సమ్మెను విరమించినట్లు కార్మికులు తెలిపారు. మూడు నెలల నుంచి కళ్యాణదుర్గం నియోజకవర్గంలోని 220 గ్రామాలకు శ్రీరామిరెడ్డి తాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయం తెలిసిందే. సమ్మె విరమణకు చొరవ చూపిన ఎమ్మెల్యేకు ప్రజలతో పాటు కార్మికులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్చ్.. ఇంకేం చేస్తారు..!

వర్షాభావంతో ఎండిన పత్తి పంటను దున్నేస్తున్న రైతులు



పత్తిపంటను తొలగిస్తున్న రైతు వాసుదేవరెడ్డి

యాడికి, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌ను వర్షాభావం వెంటాడుతోంది. దీంతో అరకొర వానకు సాగు చేసిన పత్తి విత్తనాలు మొలకెత్తక పోవడం, మొలకెత్తినవి ఎండి పోతుండటంతో రైతులు వాటిని తొలగించే పనిలో పడ్డారు. మండలంలోని తిరుణాంపల్లి గ్రామం వద్ద వాసుదేవరెడ్డి అనే రైతు శనివారం తన ఐదున్నర ఎకరాల పొలంలో సాగు చేసిన పత్తిపంటను ట్రాక్టర్‌తో దున్నేస్తూ కనిపించాడు. ముందస్తు వర్షాలకు ఐదున్నర ఎకరాల్లో పత్తి పంట సాగు చేసినట్లు రైతు తెలిపారు. సేద్యాలు, విత్తనం తదితర ఖర్చులు కలిపి ఎకరాకు రూ.10వేల వరకు ఖర్చు చేశానన్నారు. పత్తి విత్తనం సరిగా మొలకెత్తలేదని తెలిపారు. విత్తు తర్వాత వర్షం పడకపోవడంతో మొలకలు కూడా ఎండిపోతుండటంతో దిక్కుతోచక దున్నేస్తున్నట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. తిరుణాంపల్లి, చిక్కేపల్లి, నిట్టూరు, వీరారెడ్డిపల్లి, కమలపాడు గ్రామాల్లో పత్తి సాగు చేసిన రైతుల అందరి పరిస్థితి ఇలాగే ఉంది. ఇప్పటికే పదుల సంఖ్యలో రైతులు వందల ఎకరాల్లో పత్తి పంటను తొలగించారు. ఈ ప్రాంతాన్ని కరువు మండలంగా ప్రకటించినా రైతులకు ఎటువంటి సహాయక చర్యలు అందలేదు.

ఉద్యోగాల కల్పనే ధ్యేయం

● అనంత ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ
● అంబికా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా
● 25 కంపెనీలకు పైగా హాజరు

అనంతపురం క్రైం, జూలై 12(ఆంధ్రజ్యోతి): అనంతపురం యువతకు ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా అంబికా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించినట్లు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ తెలిపారు. నగర శివారులోని ఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో అంబికా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం మెగా జాబ్ మేళా నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వేలాది మంది యువత హాజరయ్యారు. జాబ్ మేళాను ఎంపీతో కలిసి కలెక్టర్ వినోద్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ యువత నైపుణ్యం పెంచుకుంటే ఉద్యోగాలు వెతుక్కుంటూ వస్తాయని ఆయన పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో మెగా జాబ్ మేళా నిర్వహించినట్లు తెలిపారు. వెనుకబడిన అనంతపురంలో చాలా మంది నిరుద్యోగ యువత అవకాశాల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. అందుకే బెంగళూరు, ఇతర ప్రాంతాల నుంచి ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీలను తీసుకొచ్చి, మెగా జాబ్ మేళా నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో రెండు వేల పైచిలుకు యువత పాల్గొన్నారన్నారు. ఇప్పటికే 5 వేల మందికి ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. తాజాగా మరో వెయ్యికి పైగా ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. తర్వాత జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ మాట్లాడుతూ అనంతపురం, శ్రీసత్యసాయి, చిత్తూరు జిల్లాల నుంచి కూడా యువత జాబ్ మేళాకు వచ్చారన్నారు. 25కి పైగా కంపెనీలు పాల్గొన్నాయని పేర్కొన్నారు. మేళాలో రిజిస్ట్రేషన్, ఇంటర్వ్యూల కోసం ప్రత్యేక వసతులు కల్పించడం బాగుందన్నారు. యువత కోసం జాబ్ మేళా నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. త్వరలో అనంతపురానికి 12 సంస్థలు రానున్నాయని, వాటి కోసం భూమి సేకరిస్తున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. తర్వాత అంబికా ఫౌండేషన్ చైర్మన్ జీవీ వీక్షిత్ మాట్లాడుతూ గత 16 ఏళ్లుగా హిందూపురంలో అంబికా ఫౌండేషన్ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. 2024లో ఎంపీగా అంబికా గెలుపొందిన తర్వాత ఈ ఫౌండేషన్ సేవలు విస్తృతమయ్యాయన్నారు. సుమారు 1000 వరకూ ఉద్యోగ ఖాళీలు భర్తీ చేసేలా ప్రణాళికతో ముందుకెళ్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నగర మాజీ మేయర్ స్వరూప, ప్రముఖ లాయర్ పరిటాల శైలజ, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



నిరుద్యోగులకు సూచనలిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



జాబ్‌మేళాకు భారీగా హాజరైన నిరుద్యోగులు

విజేత అనంత

● ముగిసిన మల్టీ డే క్రికెట్ పోటీలు



కమిల్

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 12(ఆంధ్రజ్యోతి): మల్టీ డే క్రికెట్ పోటీల్లో కర్నూలు జట్టుపై అనంతపురం జట్టు గెలుపొందింది. నాలుగో రౌండ్ సీనియర్ మల్టీ డే క్రికెట్ పోటీలు స్థానిక అనంత క్రీడాగ్రామంలో శనివారం ముగిశాయి. అనంతపురం, కర్నూలు జట్ల మధ్య పోటీ జరిగింది. మొదటి ఇన్నింగ్స్‌లో అనంతపురం 267 పరుగులకు ఆలౌట్ కాగా కర్నూలు 178పరుగులకే కుప్పకూలింది. 89 పరుగుల ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 204 పరుగులకు ఆలౌట్ అయ్యింది. అనంతరం 293 పరుగుల లక్ష్యం తో రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన కర్నూలు 255 పరుగులకు ఆలౌట్ అయ్యి పరాజయం పాలైంది. అనంతపురానికి బౌలర్ కమిల్ 7 వికెట్లు పడగొట్టాడు. జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ప్రకాష్ రెడ్డి, భీమలింగారెడ్డి విజేత జట్టును అభినందించారు.

రేపు కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్

అనంతపురం కలెక్టరేట్, జూలై 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మీ కోసం కాల్ సెంటర్ 1100సేవలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమాన్ని ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహిస్తామన్నారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీకి సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు.

మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల నిరవధిక సమ్మె

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 12(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరవధిక సమ్మెలోకి దిగినట్లు సీఐటీయూ అనుబంధ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు శనివారం తెలిపారు. స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయం నుంచి సీఐటీయూ, మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు, పారిశుధ్య కార్మికులు కలిసి సప్తగిరిసర్కిల్, సుభాష్‌రోడ్డు మీదుగా టవర్‌క్లాక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర అధ్యక్షుడు వెంకటనారాయణ, మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల యూనియన్ గౌరవాధ్యక్షుడు గోపాల్ మాట్లాడుతూ అనేక రోజులుగా ఆందోళన చేస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించని కారణంగా శనివారం అర్ధరాత్రి నుంచి సమ్మెకు దిగుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన న్యాయమైన కోర్కెలను పరిష్కరించడంలో మంత్రి స్పష్టమైన హామీ ఇవ్వడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె విరమించేదిలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ అనుబంధ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు మల్లికార్జున, సంజీవరాయుడు, ఓబుళపతి, మురళి, పోతులయ్య, తిరుమలేష్, ఎర్రిస్వామి, లక్ష్మినరసమ్మ, వరలక్ష్మి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



నగరంలో ర్యాలీ చేస్తున్న సీఐటీయూ, మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

గండం గట్టెక్కేలా..

(5వ పేజీ తరువాయి)



పెనుకొండ వద్ద ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి(ఫైల్)

వాహనం ఢీకొని మరణిస్తే మృతుడి కుటుంబానికి రూ.2లక్షలు, తీవ్రంగా గాయపడితే రూ.50వేలు ప్రభుత్వం మంజూరు చేస్తుంది. గతనెలలో రాష్ట్రస్థాయిలో అధికారుల సమావేశంలో వీటిని అమలు చేయాలని ఉన్నతాధికారులు జిల్లా అధికారులకు ఆదేశించారు. ఇందుకోసం జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటు చేశారు. చైర్మన్‌గా క్లైయింట్స్ సెటిల్‌మెంట్ కమిషన్‌ను నియమిస్తారు. మరో ఆరుగురు సభ్యులు ఇందులో ఉంటారు. రాష్ట్ర ప్రభుత్వంచే నియమించిన క్లైయింట్స్ విచారణ అధికారి, జిల్లా ఎస్పీ లేదా అదనపు ఎస్పీ, జిల్లా చీఫ్ మెడికల్ ఆఫీసర్, రీజనల్ ట్రాన్స్‌పోర్ట్ అధికారి (ఆర్టీఓ), చైర్మన్ ద్వారా నియమించబడ్డ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి, సాధారణ బీమా కౌన్సిల్‌చే నియమించబడ్డ అధికారి సభ్యులుగా ఉంటారు. ఎవరైతే రోడ్డు ప్రమాదంలో మరణిస్తారో లేదా గాయపడి ఉంటారో వారి కుటుంబ సభ్యులు ఆధారాలతో జిల్లా కమిటీకి దరఖాస్తు చేసుకుంటే, పరిశీలించి మరణించినవారికి రూ.2లక్షలు, గాయపడ్డవారికి రూ.50వేలు ఆర్థిక సాయం అందజేస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రెండు పథకాలు రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందిన, గాయపడిన కుటుంబాలకు ఎంతగానో ఆదుకుంటాయి. క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ ఆఫ్ రోడ్ యాక్సిడెంట్స్ విక్టిమ్స్, హిట్‌అండ్‌రన్ పథకాలు బాధితులకు కొండంత అండగా నిలుస్తాయి. ఈ పథకాలను బాధిత కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి. దీనివల్ల మెరుగైన వైద్య చికిత్స చేయించేందుకు ఎంతగానో దోహదపడుతుంది.

- కరుణాసాగర్‌రెడ్డి, ఆర్టీఓ, హిందూపురం

మారింది పేరు మాత్రమే..!

(5వ పేజీ తరువాయి)

వ్యవసాయాధికారులు ఇబ్బంది పడ్డారు. టీడీపీ అధికారం లోకి వచ్చినప్పటి నుంచి పింఛన్ల పంపిణీ చేసే పనులను సచివాలయ సిబ్బందితోపాటు ఆర్ఎస్‌కే(ఆర్‌బీకే పేరుమార్చారు) సిబ్బందికి అప్పగించారు. పంచాయతీ సెక్రటరీ కంట్రోల్‌లో ఆయా సిబ్బంది ఉండటమే ఇందుకు కారణమంటున్నారు.

వేతనం ఒక చోట... పనులు మరో చోట

అనంత జిల్లాలో 451 రైతు సేవా కేంద్రాలున్నాయి. క్రమబద్ధీకరణలో భాగంగా పంటల సాగు విస్తీర్ణం ఆధారంగా ఆయా ప్రాంతాల్లో ఆయా శాఖల సిబ్బందిని కేటాయించారు. ఇందులో భాగంగా 126 కేంద్రాలకు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, 180 కేంద్రాలకు విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు, 12 కేంద్రాలకు సెరికల్చర్ అసిస్టెంట్లను కేటాయించారు. మిగిలిన 133 కేంద్రాలు వ్యవసాయ శాఖ ఎంపీఈఓలు విధులు నిర్వర్తించేలా నిర్ణయించారు. శ్రీ సత్యసాయి జిల్లాలో 420 రైతు సేవా కేంద్రాలున్నాయి. ఇందులో 124 కేంద్రాలకు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు, 143 కేంద్రాలకు విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్లు, 73 కేంద్రాలకు సెరికల్చర్ అసిస్టెంట్లను కేటాయించారు. మిగిలిన 80 కేంద్రాలకు వ్యవసాయ శాఖ ఎంపీఈఓలను కేటాయించారు. ఆర్ఎస్‌కే సిబ్బంది వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్ శాఖలకు సంబంధించిన పనులు చేస్తున్నారు. ఖరీఫ్, రబీ సీజన్లల్లో పంటల ఈ క్రాపింగ్, విత్తన పంపిణీ, ఎరువులు, క్రిమిసంహారక మందుల పంపిణీ, రైతు భరోసా, పీఎం కిసాన్, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ జాబితా వెరిఫికేషన్‌తోపాటు క్షేత్ర స్థాయిలో రైతులకు అందుబాటులో ఉంటూ పలు రకాల పనులు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల క్రమబద్ధీకరణలో భాగంగా పంటల సాగు విస్తీర్ణం ఆధారంగా కొన్ని స్థానాలు మార్పు చేయడంతో సరిపెట్టారు. అయితే ఏ శాఖకు సంబంధించిన పనులు చేసే సిబ్బందిని ఆయా మాతృశాఖలకే కేటాయించలేదు. దీంతో పాత పద్ధతిలోనే వేతనం ఒక చోట తీసుకొని.. పనులు మరో చోట చేయాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా డీడీఓ (డ్రాయింగ్ డ్రాఫ్ట్ ఆఫీసర్) బాధ్యతలను వ్యవసాయ, ఉద్యాన అధికారులకు అప్పగించి, వేతనాలు, సెలవులు మంజూరు పూర్తి బాధ్యతలను ఆయా శాఖల అధికారులకే అప్పగించే లా మార్పులు చేయాలని ప్రభుత్వాన్ని సిబ్బంది కోరుతున్నారు.



ఇబ్బందులు వస్తున్నాయి

ఆర్ఎస్‌కే సిబ్బంది పనులు చేసేది ఒక చోట, కంట్రోల్ పవర్ మరో శాఖ అధికారులకు అప్పగించడంతో ఇబ్బందులు వస్తున్నాయి. ఆర్ఎస్‌కే సిబ్బందికి పంచాయతీరాజ్ శాఖ ద్వారా వేతనాలు ఇస్తున్నారు. పనులేమో వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్ శాఖల్లో చేయిస్తున్నారు. ఎస్ఆర్‌లు మాత్రమే వ్యవసాయ శాఖ ఏడీఏ, ఉద్యాన అధికారి వద్ద ఉంచారు. ఆయా సిబ్బందికి వేతనాల బిల్లులు పెట్టడం, సెలవులు మంజూరు చేసే అధికారిన్ని పంచాయతీ సెక్రటలకు అప్పగించారు. దీంతో వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులకు ఆర్బీకే సిబ్బందిని పర్యవేక్షించి, నియంత్రించే అధికారం లేకుండా పోయింది. వేతనాలు ఎవరు మంజూరు చేస్తున్నారో ఆ శాఖ అధికారుల మాటలే సిబ్బంది వినాల్సి వస్తోంది. గతంలో అనేక సార్లు ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేదు.

- లక్ష్మీనారాయణ, గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి



మాతృశాఖలకే కేటాయించాలి

వ్యవసాయ, ఉద్యాన, సెరికల్చర్ మాతృశాఖలకే ఆర్ఎస్‌కే సిబ్బందిని పూర్తిగా కేటాయించాలి. వేతనాలు, సెలవులు, ఇతర రకాల పనులు చేసే బాధ్యతను ఆయా శాఖల అధికారులకే అప్పగించాలి. పనులు ఒక శాఖలో చేస్తూ, వేతనం, సెలవులు మంజూరు చేసే బాధ్యతను ఇతర శాఖ అధికారులకు అప్పగించడం సరికాదు. కొత్త ప్రభుత్వం ఆర్ఎస్‌కే వ్యవస్థ నిర్వహణలో మార్పులు చేసి, పాలనను గాడిలో పెట్టాల్సిన అవసరం ఉంది.

- అంజన్‌రెడ్డి, గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తామని మోసం

విజయనగరం కన్సల్టెన్సీ నిర్వాహకులపై కేసు

యాడికి, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఫిలిప్పిన్స్ దేశంలో ఎంబీబీఎస్ సీటు ఇప్పిస్తామని చెప్పి, డబ్బులు తీసుకొని మోసగించిన విజయనగరానికి చెందిన కన్సల్టెన్సీ నిర్వాహకులపై శనివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. యాడికికి చెందిన యజ్ఞానిబాషా తన కుమార్తెకు ఫిలిప్పిన్స్‌లో ఎంబీబీఎస్ సీటు కోసం 2022లో విజయనగరానికి చెందిన కన్సల్టెన్సీ నిర్వాహకులు గణేష్, రామారావులకు రూ.3,30,000 చెల్లించాడు. వారు ఎంబీబీఎస్ సీటు ఇప్పించకుండా కాలయాపన చేశా రు. డబ్బు చెల్లించి రెండేళ్లు గడిచినా సీటు ఖరారు చేయకపోవడంతో మోసపోయినట్లు గ్రహించిన బాధితుడు యజ్ఞానిబాషా కన్సల్టెన్సీ నిర్వాహకులను నిలదీశాడు. దీంతో వారు రూ.1.25 లక్షలు తిరిగి చెల్లించారు. మిగతా డబ్బు చెల్లించకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కన్సల్టెన్సీ నిర్వాహకులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఏఎన్ఎంలకు నేడు రీ కౌన్సెలింగ్

అనంతపురం వైద్యం, జూలై 12(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఏఎన్ఎంలకు గత నెల 30న నిర్వహించిన బదిలీల కౌన్సెలింగ్ రద్దు నేపథ్యంలో ఆదివారం రీ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్ఓ ఈబీ దేవి శనివారం తెలిపారు. గతంలో మాదిరే ఆన్‌లైన్ ద్వారా బదిలీలు నిర్వహిస్తామన్నారు. సీనియార్టీ ప్రకారం ఉద్యోగులు కోరుకునే సచివాలయాలను కేటాయిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలోని సచివాలయ ఏఎన్ఎంలు ఆయా పరిధిలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల డాక్టర్లతోపాటు కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు.

సర్దుకుపోతే.. సమస్య చిన్నదే..!

(5వ పేజీ తరువాయి)

చేసేదిలేక పోలీసులు.. కేసులు నమోదు చేయాల్సి వస్తోంది. ప్రేమించి పెళ్లి చేసుకున్న వారు కూడా విడాకుల బాట పడుతున్నారు. పెళ్లయ్యాక మునుపటి స్థాయిలో తమపై ప్రేమ చూపడంలేదనీ, ఇతర చిన్నచిన్న విషయాలకు గొడవపడుతూ పోలీసు స్టేషన్ గుమ్మం తడుతున్నారు. పట్టణాలే కాదు, కాక మారుమూల పల్లెల నుంచి సైతం అధికంగా ఫిర్యాదులు, దరఖాస్తులు వస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇదివరకు పెద్దలు కుదిర్చిన పెళ్లిళ్ల విషయంలో భార్యాభర్తల మధ్య వివాదం తలెత్తితే పెద్దమనుషులు సర్దిచెప్పేవారు. చిన్న కుటుంబాలు పెరగడం, పెద్దల మాటలను పెడచెవిన పెడుతుండటంతో చిన్న గొడవ జరిగినా పోలీసు స్టేషన్లను ఆశ్రయిస్తున్నారు. ఒకరికొకరు తోడుండాల్సిన వారు అపార్థాలు, స్పర్థలతో మధ్యలోనే తమ ప్రయాణాన్ని ముగిస్తున్నారు. అటువంటి వారికి పోలీసు, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖల పరిధిలో గృహహింస నివారణ విభాగ అధికారులు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. అయినా రాజీకి రాని పక్షంలో పోలీసులు కేసు నమోదు చేసి, న్యాయస్థానంలో హాజరు పరుస్తున్నారు. దీంతో మూడుముళ్ల బంధంతో ఒక్కటైన జంటలు విడిపోతున్నాయి. ఇటీవల చిన్నచిన్న మనస్పర్థలే పెద్దవై విడాకులు తీసుకునే వారి సంఖ్య అనూహ్యంగా పెరిగిపోతోందని పోలీసు, కౌన్సెలింగ్ వర్గాలు చెబుతున్నాయి. యువ జంటలు మొదలుకుని, 50 ఏళ్లు పైబడిన వారు కూడా విడాకులు కోరుతుండడం విచారకరం. ఉమ్మడి కుటుంబానికి కొంతమంది మహిళలు సుముఖత చూపడంలేదు.

పెద్దలతో కౌన్సెలింగ్

2014-19 మధ్య హిందూపురంలో మూడు మతాలకు చెందిన మతపెద్దలతో ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ ఏర్పాటు చేశారు. భార్యాభర్తలు గొడవపడి పోలీసు స్టేషన్‌కు వస్తే మత పెద్దలను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చిన సందర్భాలున్నాయి. వైసీపీ హయాంలో ఆ కమిటీకి పోలీసులు ప్రాధాన్యత ఇవ్వలేదు. టీడీపీ హయాంలో రెండేళ్లలోనే 173 జంటలకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు సమాచారం. 112 జంటలు కలిసి, దాంపత్య జీవనం సాగిస్తున్నాయి. మిగిలిన జంటలను విడిపోవడానికే మొగ్గుచూపినట్లు తెలుస్తోంది. ఈ లెక్కన ఆయా మత పెద్దలతో ఫ్యామిలీ కౌన్సెలింగ్ చాలా మేరకు సత్ఫలితాలు ఇచ్చినట్లు స్పష్టమవుతోంది.

సర్దుకుంటే సరిపోతుంది

వివాహ బంధాన్ని గౌరవించుకోవాలి. దంపతులు అన్యోన్యంగా ఒకరినొకరు అర్థం చేసుకుంటూ మనసు విప్పి మాట్లాడుకోవాలి. ఏ సమస్య, గొడవ వచ్చినా సద్దుమణుగుతాయి. భాగస్వాముల మధ్య సర్దుకుపోయే మనస్తత్వం ఉండాలి. కుటుంబం కోసం సమయం కేటాయించడంపై దృష్టి సారించాలి. మొబైల్ ఫోన్లు, టెలివిజన్ అవసరం మేరకు ఉపయోగించాలి. భార్యాభర్తలు చెబుతున్న సమస్యల్లో కొన్ని చాలాచిన్నవి. చాలావరకు సర్దుకుపోదగ్గవే. గొడవపడి పోలీసు స్టేషన్లకు వస్తున్న దంపతులకు కౌన్సెలింగ్ ఇచ్చి వారి మధ్య సఖ్యత కుదర్చడానికి ప్రయత్నిస్తున్నాం.

- అదినారాయణ, డీఎస్పీ, జిల్లా మహిళా పోలీసు స్టేషన్

సర్దుకుపోదగ్గవే..

భాగస్వాముల మధ్య సర్దుకుపోయే మనస్తత్వం లేక గొడవలు పడుతున్నారు. ఒకరినొకరు అర్థం చేసుకోవాలి. పరస్పరం గౌరవభావం పెంపొందించుకోవాలి. చాలావరకు సమస్యలు సర్దుకుపోదగ్గవే అయినా, ఆ వైపు దృష్టి సారించడంలేదు. జిల్లాలో వన్‌స్టాప్ సెంటర్‌కు 73 ఫిర్యాదులు వస్తే.. ఒకట్రెండు సార్లు భార్యాభర్తలకు విడివిడిగా, ఉమ్మడిగా కుటుంబ సభ్యులతో కౌన్సెలింగ్ ఇస్తూ రాజీ చేస్తున్నాం. విడాకుల వరకు వెళ్లిన 11 జంటలను కౌన్సెలింగ్ ఇచ్చి కలిపాం. గృహహింస విచారణ విభాగాన్ని ఆశ్రయిస్తున్న దంపతులు చెబుతున్న సమస్యల్లో కొన్ని చిన్నవే. సంసారంలో చిన్న చిన్న సమస్యలు సాధారణమే. నేటి యువతీయువకులు వాటిని అధిగమించడంలో విఫయమవుతున్నారు. తక్కువ సమయంలోనే కలిసుండలేమని నిర్ణయం తీసుకుంటూ కొందరు విడిపోవడానికి సిద్ధపడుతున్నారు. భవిష్యత్తులో తలెత్తే సమస్యల గురించి ఆలోచించండంలేదు. వాటిని వివరిస్తూ పలుమార్లు కౌన్సెలింగ్ ఇస్తున్నాం.. మార్పు వస్తోంది.

- హసీనా, ప్రతినిధి, వన్‌స్టాప్ సెంటర్

మాకు పని కల్పించొద్దు

వైసీపీ నాయకులకు డీఎస్పీ వార్నింగ్



పోలీసుస్టేషన్ నుంచి బయటకు వస్తున్న వైసీపీ నాయకులు

పెనుకొండ టౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): అతిగా ప్రవర్తించి తమకు పని కల్పించకండని డీఎస్పీ నర్సింగప్ప సోమందేపల్లి వైసీపీ నాయకులను తీవ్రంగా హెచ్చరించినట్లు సమాచారం. సోమందేపల్లి వైసీపీ ముఖ్యనాయకులను శనివారం డీఎస్పీ కార్యాలయానికి పిలిపించారు. సీఐ రాఘవన్, ఎస్ఐ రమేష్‌తో కలిసి డీఎస్పీ కార్యాలయంలో వైసీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈనెల 4న సోమందేపల్లి మండలం పాపిరెడ్డిపల్లి కేజీబీవీ విద్యార్థులు 30మంది అస్వస్థతకు గురికావడంపై వైసీపీ నాయకుల తీరును డీఎస్పీ తప్పుబట్టారు. విద్యార్థినుల పరామర్శ పేరుతో వైసీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీ చరణ్, నాయకులు హంగామా చేయడం సరికాదన్నారు. 108 అంబులెన్స్‌ను అడ్డుకోవడం, బైఠాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి సవిత పరామర్శకు వచ్చిన సందర్భంలో వివాదాన్ని పెంచడానికి ప్రయత్నించడంపై డీఎస్పీ మండిపడినట్లు తెలిసింది. నిజానిజాలు తెలుసుకుని నాయకులు ప్రవర్తించాలని, అలాకాకుండా రచ్చ చేస్తే చర్యలు తీవ్రంగా ఉంటాయని డీఎస్పీ హెచ్చరించినట్లు సమాచారం. కుటుంబాలున్నాయి, అల్లర్లకు పోకుండా, హుందాగా రాజకీయాలు చేసుకోవాలని హితవు పలికినట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మృతుడిది కడపజిల్లా సింహాద్రిపురం మండలం చెర్లోపల్లి

యాడికి, జూలై 12(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపుతప్పి ఒకరు మృతి చెందిన సంఘటన శనివారం ఉదయం యాడికి మండలం దైవాలమడుగు- చందన గ్రామాల మధ్య జరిగింది. ఈ సంఘటనలో కడప జిల్లా సింహాద్రిపురం మండలం చెర్లోపల్లి గ్రామానికి చెందిన విజయభాస్కర్‌రెడ్డి (43) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు చెర్లోపల్లికి చెందిన విజయభాస్కర్‌రెడ్డి నంద్యాలజిల్లా ప్యాపిలి వద్ద ఉన్న అరుణాచలేశ్వర ట్రాన్స్‌పోర్ట్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈక్రమంలో 20రోజులకు ఒకసారి చెర్లోపల్లి గ్రామానికి వెళ్లి వస్తుండేవాడు. శనివారం ఉదయం విధులను ముగించుకొని సొంత గ్రామానికి ద్విచక్రవాహనంపై బయల్దేరాడు. దైవాలమడుగు- చందన గ్రామాల మధ్య రోడ్డు మలుపు వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పింది. దీంతో విజయభాస్కర్‌రెడ్డి వ్యవసాయ పొలంలోకి ఎగిరిపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి భార్య అమరావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడిపత్రికి తరలించారు. మృతుడికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు.

టైరు మారుస్తుండగా ప్రమాదం

బస్సు డ్రైవర్ మృతి

గుత్తిరూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిడికొండ గ్రామ శివారు 44వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎండీ మునీర్(48) అనే డ్రైవర్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు హైదరాబాద్‌కు చెందిన మునీర్ ఓ ట్రావెల్ బస్సు డ్రైవర్‌గా పని చేసేవాడు. విధి నిర్వహణలో భాగంగా హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్తుండగా శనివారం తెల్లవారుజామున కరిడికొండ గ్రామ శివారులో బస్సు టైర్ పంచర్ అయ్యింది. టైరు మారుస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన మునీర్‌ను బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ సంఘటపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

కౌలు రైతు ఆత్మహత్య

ఆరు నెలల కిందట భార్య మృతి

దిక్కులేని స్థితిలో ఇద్దరు బిడ్డలు



రామకృష్ణ(ఫైల్)

కణేకల్లు, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తుంబిగనూరు గ్రామానికి చెందిన కౌలురైతు రామకృష్ణ(44) అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడని బంధువులు తెలిపారు. రామకృష్ణ గ్రామంలో దాదాపు 10 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని మొక్కజొన్న, సజ్జ, పప్పుశనగ సాగు చేశాడు. పంటలు సక్రమంగా పండక రూ.4 లక్షల వరకూ అప్పులు చేశాడు. ఆయన భార్య ఎల్లమ్మ వైద్యానికి మరో రూ.3 లక్షలు అప్పుచేశాడు. ఆమె ఆరునెలల క్రితం మృతిచెందారు. దీంతో మానసికంగా కుంగిపోయిన రామకృష్ణ, అప్పుల ఒత్తిడిని భరించలేకపోయాడు. ఈ క్రమంలో శనివారం ఉదయం తన ఇంట్లో విషపు గుళికలు మింగాడు. బంధువులు ఆయనను కణేకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురానికి తరలించారు. అయినా ప్రయోజనం లేకపోయిందని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు. రామకృష్ణ మృతితో అతని కూతురు బేబి, కుమారుడు విష్ణు దిక్కులేనివారయ్యారు. ప్రభుత్వం వారిని ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నాగమధు తెలిపారు.

కొడుకులు ప్రయోజకులు కాలేదని..!

ఉరవకొండ, జూలై 12(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సిమెంట్ ఇటుకల వ్యాపారి హజరతయ్య(55) శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. మల్లేశ్వర థియేటర్ సమీపంలో ఉంటున్న హజరతయ్య సిమెంట్ ఇటుకలు, రింగుల వ్యాపారం చేసేవాడు. ఆయనకు భార్య రాజమ్మ, ముగ్గురు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. వీరిలో కుమారుడు, కూతురుకు వివాహం జరిగింది. మిగిలిన ఇద్దరు కుమారులు ప్రయోజకులు కాలేదని దిగులుపడేవాడు. తన ఆరోగ్యం కూడా సరిగాలేదని హజరతయ్య మనస్తాపం చెందాడు. ఈ క్రమంలోనే అనంతపురం బైపాస్ రోడ్డులోని సిమెంట్ ఇటుకలు తయారు చేసేచోట ఉరి వేసుకున్నాడు. కొద్ది సేపటి తర్వాత గమనించిన స్థానికులు అతడిని ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడి భార్య రాజమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.



సభా వేదికపై పూర్వవిద్యార్థులు

మళ్లీ చదువులమ్మ ఒడిలో..!

కొడిగెనహళ్లిలో ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

హాజరైన తెలంగాణ చీఫ్ సెక్రటరీ, పీవీ కుమార్తె



పూర్వ విద్యార్థులైన ఉన్నతాధికారులకు విద్యార్థుల గౌరవ వందనం

పరిగి, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడిగెనహళ్లి గురుకుల పాఠశాలలో శనివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులైన తెలంగాణ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు కుమార్తె, ఎమ్మెల్సీ సురభివాణి, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చీఫ్ సెక్రటరీ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశా ల ఆవరణలో గురుకులాల రూపకర్త అయిన పీవీ నరసింహారావు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. పాఠశాల మైదానంలో విద్యార్థులు పరేడ్ డ్రిల్‌తో అతిథులు, పూర్వ విద్యార్థులను స్వాగతించారు. ఈ సందర్భంగా చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు మాట్లాడుతూ 1976లో తన తాతగారితో కలిసి ఈ పాఠశాలకు అడుగుపెట్టినట్లు తెలిపారు. పట్టుదల, క్రమశిక్షణతో చదివి 1979లో పదో తరగతిలో 560 మార్కులు సాధించినట్లు తెలిపారు. తాను నేడు ఈ స్థానంలో ఉండటానికి కొడిగెనహళ్లి గురుకుల పాఠశాలలో చదవడమే కారణమని తెలిపారు. అనంతరం పీవీ కుమార్తె సురభివాణి మాట్లాడుతూ తన తండ్రి ప్రతి ఇంటిలో పిల్లలు విద్యనభ్యసించాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి హోదాలో రాష్ట్రంలో మూడు చోట్ల గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. అందులో కొడిగెనహళ్లి గురుకుల పాఠశాల ఒకటన్నారు. ఇక్కడ చదువుకున్న ఎంతోమంది ఐఏఎస్, ఐపీఎస్‌గా మారి దేశానికి సేవలందిస్తున్నార న్నారు. గురుకుల పాఠశాలలో పూర్వ విద్యార్థుల తరఫున వచ్చే సంవత్సరంలో పదో తరగతి మొదటి స్థానం సాధించిన విద్యార్థికి రూ.10లక్షలు బహుమతి అందజేస్తామని తెలంగాణా ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరావు తెలిపారు. పాఠశాలలో కలియదిరిగి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నంతరం స్నేహితులతో కలిసి విందు ఆరగించారు. పీఓ కిష్టప్ప, ఆర్డీఓ ఆనంద్‌కుమార్, తహసీల్దార్ హసీనాసుల్తానా, ఎంఈఓ లక్ష్మీదేవి, శేషాచలం, మాజీ ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు, పూర్వవిద్యార్థులకు ప్రస్తుత విషయాలను వివరించారు.

గడువులోగా ప్రీమియం చెల్లించాలి

వాతావరణ బీమాకు 15 వరకే గడువు

ఫసల్ బీమాకు 31 వరకూ.. వరికి ఆగస్టు 15 వరకు..

జేడీఏ ఉమా మహేశ్వరమ్మ

అనంతపురం అర్బన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): వాతావరణ ఆధారిత బీమా ప్రీమియం చెల్లించేందుకు ఈ నెల 15వ తేదీ వరకే గడువు ఉందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. జిల్లాలో వేరుశనగ, పత్తి, దానిమ్మ, చీనీ, టమోటా, అరటి పంటలకు వాతావరణ ఆధారిత బీమా వర్తిస్తుందని తెలిపారు. ఈ పంటలను మండలాన్ని యూనిట్‌గా పరిగణిస్తారని తెలిపారు. ఈ ఏడాది జూలై 1 వతేదీ నుంచి వచ్చే ఏడాది మే నెలాఖరు దాకా అల్ప, అధిక వర్షపాతం, గాలిలో తేమ శాతం, గాలి వేగం, అధిక ఉష్ణోగ్రత పరిణామాలను మండల స్థాయిలో లెక్కించి.. బీమాను వర్తింపజేస్తారని తెలిపారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా కోసం కంది, జొన్న, మొక్కజొన్న, ఆముదం, ఎండు మిరప పంటలకు ఈ నెల 31లోపు ప్రీమియం చెల్లించాలని సూచించారు. వరి పంటకు ఆగస్టు 15వరకు అవకాశం ఉందని తెలిపారు. నేషనల్ క్రాప్ ఇన్సూరెన్స్ పోర్టల్‌లో రైతులు నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. బ్యాంకులో పంట రుణం పొందిన రైతులకు రుణం నుంచి ప్రీమియం సొమ్మును బ్యాంకు సిబ్బంది జమ చేస్తారని తెలిపారు. నోటిఫికేషన్‌కు ముందే బ్యాంకు రుణం తీసుకున్న రైతులు తమ ఖాతా నుంచి ప్రీమియం సొమ్ము చెల్లించాలని సంబంధిత బ్యాంకు అధికారులకు వినతి పత్రం అందించాలని సూచించారు. రుణం తీసుకోని రైతులు స్వతహాగా కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా, ఎన్‌సీఐపీ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. ఇందుకు ఆధార్, భూమి పత్రాలు, కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డు అవసరమని తెలిపారు. రైతు డిక్లరేషన్ లేని పక్షంలో, పంట వేసినట్లు ధ్రువీకరణ పత్రాన్ని ఆర్ఎస్‌కే సిబ్బందితో తీసుకోవాలని కౌలు రైతులకు సూచించారు. ఈ పంట నమోదు చేసుకున్న పత్రం, సెల్ నంబర్, రైతు సేవింగ్ ఖాతా వివరాలు కూడా నమోదుకు అవసరమని తెలిపారు.

వాతావరణ ఆధారిత బీమా ప్రీమియం వివరాలు

పంట పేరు	బీమా మొత్తం (హెక్టార్‌కు)	రైతు చెల్లించాల్సిన మొత్తం ఎకరాకు	హెక్టార్‌కు	గడువు తేదీ
వేరుశనగ	80000	640	1600	జూలై 15
పత్తి	95000	1140	1600	జూలై 15
దానిమ్మ	187500	3750	9375	జూలై 15
చీనీ	137500	2750	6875	జూలై 15
టమోటా	80000	1600	4000	జూలై 15
అరటి	150000	3000	7500	జూలై 15

దమ్ముంటే ప్రజల్లోకి రండి

ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు



మాట్లాడుతున్న కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, జూలై 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు ఐదేళ్ల అరాచక పాలనతో వేలాది కుటుంబాలను వీధుల పాలుచేసి, వేలకోట్లు దోచుకున్నారని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు మండిపడ్డారు. వారికి దమ్ము, ధైర్యం ఉంటే ప్రజల్లోకి రావాలని సవాలు విసిరారు. పట్టణంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం తొలి ఏడాదిలో చేసిన అభివృద్ధిని చూసి ప్రజల్లో కృతజ్ఞతాభావం కనిపిస్తోందని అన్నారు. ఐదేళ్ల దోపిడీ రాజ్యం పీడవీడిందని అన్ని వర్గాల ప్రజలు, రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారని అన్నారు. కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేందుకు చంద్రబాబు మేనిఫెస్టోపై ప్రజల్లోకి వెళ్తామని వైసీపీ పేర్కొనడం వారి దగాకోరు తనానికి నిదర్శనమని మండిపడ్డారు. మద్యం కుంభకోణం ద్వారా వేలాది పేదల జీవితాలతో ఆడుకున్నారని, వారి రక్తం తాగిన నరరూప రాక్షసులని దుయ్యబట్టారు. రాయదుర్గం నియోజకవర్గ భవిష్యత్తును కాలరాసిన చరిత్రహీనులు వైసీపీ వారేనని అన్నారు. ఐదేళ్ల అభివృద్ధి, సంక్షేమాన్ని విస్మరించి నేడు ప్రజల్లోకి ఏ ముఖం పెట్టుకొని వెళతారని ప్రశ్నించారు. వైసీపీ పాలకుల బాధితులు వేలాది మంది ఉన్నారని, ప్రజల్లోకి వెళ్తే వారే చొక్కా పట్టుకుని నిలేస్తారని అన్నారు.

చర్లపల్లి-ధర్మవరం మధ్య

ప్రత్యేక వీక్లీ రైలు

గుంతకల్లు, జూలై 12(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీని క్లియర్ చేయడానికి ధర్మవరం-చర్లపల్లి మధ్య ప్రత్యేక రైలును నడపనున్నట్లు రైల్వే అధికారులు శనివారం తెలిపారు. ఈ నెల 13వ తేదీ నుంచి ఆగస్టు 24వ తేదీ వరకూ ప్రతి ఆదివారం ఈ రైలును నడుపుతామని తెలిపారు. చర్లపల్లిలో ఆదివారం సాయంత్రం 7-55 గంటలకు నంబర్ 07003 రైలు బయలుదేరి మరుసటి రోజు సాయంత్రం 3 గంటలకు ధర్మవరం చేరుతుందని తెలిపారు. దీని తిరుగు ప్రయాణపు వీక్లీ రైలు (నం. 07004) ఈ నెల 14వ తేదీ నుంచి ఆగస్టు 25వ తేదీ వరకూ సోమవారాలలో సాయంత్రం నాలుగున్నరకు ధర్మవరంలో బయలుదేరి, మరుసటిరోజు ఉదయం ఆరున్నర గంటలకు చర్లపల్లికి చేరుకుటుందని తెలిపారు. ఈ ప్రత్యేక రైలు నల్లగొండ, మిర్యాలగూడ, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, శ్రీకాళహస్తి, రేణిగుంట, తిరుపతి, పాకాల, పీలేరు, కలికిరి, మదనపల్లి, కదిరి మీదుగా ధర్మవరం చేరుకుంటుందని తెలిపారు.

జైలు స్నేహం.. దొంగ బంధం

నిత్యానందరెడ్డి ఇంట్లో చొరబడింది పాత నేరగాళ్లు

ఒకరిని అరెస్టు చేసిన పోలీసులు

20 తులాల బంగారం, కారు, బైకు స్వాధీనం

ఉత్తరాది ముఠా కోసం గాలింపు

హిందూపురం డీఎస్పీ మహేష్



పట్టుబడిన నిందితుడు, స్వాధీనం చేసుకున్న సొమ్ముతో పోలీసులు

హిందూపురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): పాత కేసుల్లో కర్ణాటక పోలీసులకు పట్టుబడిన ఉత్తరాది ముఠాతో అన్నమయ్య జిల్లాకు చెందిన పాత నేరస్థుడికి పరిచయం ఏర్పడింది. ఈ పరిచయంతోనే గత నెల 26న హిందూపురం మండలం కిరికెర పంచాయతీ వెంకటాద్రి లేఅవుట్‌లో దోపిడీ చేశారు. నిత్యానందరెడ్డి ఇంట్లోకి చొరబడి, కత్తులు, తుపాకీ బెదిరించి హల్‌చల్ చేశారు. ఎవరినో చంపేందుకు వచ్చి, పొరపాటున ఆ ఇంట్లో దూరినట్లు మాట్లాడుకుని, బురిడీ కొట్టించాలని చూశారు. కానీ పోలీసులకు చిక్కిపోయారు. హిందూపురం అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్‌లో ఈ కేసు వివరాలను డీఎస్పీ మహేష్ విలేకరులకు శనివారం వివరించారు. మదనపల్లి తాలూకా చిన్నతిప్పసముద్రం గ్రామానికి చెందిన షేక్ ఖాజాపీర్ ధర్మవరంలోని కేతిరెడ్డి కాలనీలో నివాసం ఉంటున్నాడు. వ్యసనాలకు బానిసై, డబ్బుల కోసం కర్ణాటక, ఏపీలోని పలుచోట్ల దొంగతనాలు చేశారు. ఇతనిపై ఇప్పటికే తొమ్మిది కేసులు ఉన్నాయి. కర్ణాటకలో నమోదైన ఓ కేసులో అక్కడి పోలీసులు అరెస్టు చేసి, చిక్కబళ్లాపుర సబ్‌జైలులో ఉంచారు. అక్కడే ఉత్తరాది ముఠాతో ఖాజాపీర్‌కు పరిచయం ఏర్పడింది. వీరందరూ ఈ ఏడాది ఫిబ్రవరిలో జైలు నుంచి బయటకు వచ్చారు. కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో దొంగతనాలు చేశారు. గత నెల 26న హిందూపురం మండలం వెంకటాద్రి లే అవుట్‌లో నిత్యానందరెడ్డి ఇంట్లోకి చొరబడ్డారు. అందరినీ బంధించి, బంగారు ఆభరణాలను దోచుకున్నారు. తాము ఎవరినో చంపడానికి వచ్చామని, ఎమ్మెల్యే కొడుకు అడ్రస్ సరిగా ఇవ్వలేదని మాట్లాడుకున్నారు. ఇదంతా ఉత్తిదేనని పోలీసులు తేల్చారు. కేసు దర్యాప్తు కోసం నాలుగు బృందాలను ఏర్పాటు చేశామని డీఎస్పీ తెలిపారు. హిందూపురం ప్రాంతంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఖాజాపీర్ శనివారం పట్టుబడ్డాడని తెలిపారు. ఇతన్నుంచి 201 గ్రాముల బంగారం ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇందులో చిలమత్తూరు పోలీస్‌స్టేషన్, హిందూపురం వన్‌టౌన్, టూటౌన్, హోస్పేట, అర్సిగెరె ప్రాంతాలలో చోరీ చేసిన బంగారం ఉందని తెలిపారు. నిత్యానందరెడ్డి ఇంట్లో 12 తులాల బంగారం ఆభరణాలను ఎత్తుకెళ్లారని, ఇందులో ఉత్తరాది ముఠా 7 తులాలను తీసుకెళ్లిందని తెలిపారు. మిగిలిన ఐదు తులాల ఆభరణాలు, నేరానికి వినియోగించిన ఐ-20 కారు, ఒక ద్విచక్రవాహనాన్ని ఖాజాపీర్ నుంచి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. దోపిడీలో ఐదుగురు పాల్గొన్నారని, మిగిలిన నలుగురి కోసం గాలిస్తున్నామని డీఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించిన సీఐలు ఆంజనేయులు, జనార్దన్, అబ్దుల్ కరీం, ఎస్ఐలు నరేంద్ర, మునీర్ అహ్మద్‌ను డీఎస్పీ అభినందించారు.

'అనంత' వేదికగా రాష్ట్ర మహాసభలు

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర కార్యదర్శి



మాట్లాడుతున్న దయా రమాదేవి

అనంతపురం టౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో సెప్టెంబరు 13, 14వ తేదీలో మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నట్లు ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి వెల్లడించారు. స్థానిక సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన మహాసభల సన్నాహక సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మధ్యాహ్న భోజన పథకం పేరు మార్పు చేయడంతోపాటు మెనూ మార్చారే తప్ప కార్మికుల బతుకులు మారలేదన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వేతన బకాయిలు, బిల్లులు వెంటనే చెల్లించడంతోపాటు పెరిగిన ధరలకు అనుగుణంగా ఒక్కో విద్యార్థికి రూ.20లు చొప్పున మెనూ చార్జీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలన్నింటిపై రాష్ట్ర మహాసభల్లో చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగమణి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్, ఐక్య ఉపాధ్యాయ సంఘం గౌరవాధ్యక్షుడు రమణయ్య, నాయకులు పద్మావతి, ఓసూరమ్మ, శివలింగమ్మ, మంజుల, రాజేశ్వరి, నాగలక్ష్మి పాల్గొన్నారు.

సనాతన ధర్మం ప్రమాదకరం

ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

అనంతపురం టౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): సమానత్వం ఇంకా రాని నేపథ్యంలో పాలకులు సనాతన ధర్మాన్ని అనుసరిద్దామంటూ చెబుతుండటం ప్రమాదకరమని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్జీఓ హోంలో ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి అధ్యక్షతన శనివారం నిర్వహించిన మహాసభల ఆహ్వాన సంఘం సమావేశంలో ఆమె మాట్లాడారు. ఐద్వా 16వ రాష్ట్ర మహాసభలను అక్టోబరు 13, 14, 15వ తేదీల్లో అనంతపురంలో నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. సమాజంలో రోజురోజుకీ మహిళలపై హింస పెరిగిపోతోందన్నారు. రాష్ట్ర మహాసభల్లో మూడు సంవత్సరాల ఉద్యమ సమీక్ష చేసుకోవడంతోపాటు వివిధ అంశాలపై చర్చలు సాగుతాయన్నారు. ఆహ్వాన సంఘం ప్యాట్రన్స్ ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ స్త్రీల పరిస్థితులు గతం కంటే నేడు మెరుగ్గా ఉన్నప్పటికీ పూర్తిగా మహిళా స్వేచ్ఛ, సమానత్వం రాలేదన్నారు. ఐద్వా ఆహ్వానసంఘం కార్యదర్శి సావిత్రి మాట్లాడుతూ ఐద్వా ఆధ్వర్యంలో 25 సంవత్సరాలుగా చేపట్టిన ఉద్యమాల్లో మేధావులు, రచయితలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికుల పాత్ర ఎంతో కీలకమైనదన్నారు. కార్యక్రమంలో ఆహ్వానసంఘం గౌరవాధ్యక్షురాలు డాక్టర్ అరుణ, అధ్యక్షురాలు గాజుల పద్మజ, ప్యాట్రన్స్ వీకే పద్మావతమ్మ, రవికాంత్ రమణ, ప్రతాప్‌రెడ్డి, డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్, డాక్టర్ బాలాకుమారి, డాక్టర్ ప్రసూన, డాక్టర్ మాధవి, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రగతి తదితరులు పాల్గొన్నారు.

బస్టాండులో రూ.20వేలు చోరీ

పెనుకొండ టౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్టీసీ బస్టాండులో శనివారం చోరీ జరిగినట్లు బాధితుడు మురళీమోహన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పెనుకొండ ఆర్టీసీ బస్టాండులో అనంతపురం బస్సు ఎక్కే సమయంలో తన భార్య సుచిత్ర వద్ద ఉన్న రూ.20వేలను దొంగిలించారన్నారు. అయితే టిక్కెట్ కొనేందుకు పర్సు తీసి చూడగా డబ్బు కనిపించలేదన్నారు. అనంతపురంలో డెంటల్ డాక్టర్‌వద్దకు పరీక్షల కోసం నగదును తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఈక్రమంలో తాన డబ్బు చోరీ అయినట్లు సుచిత్ర తన భర్త మురళీమోహన్, కొడుకు రాఘవకు సమాచారం అందించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు ఆర్టీసీ బస్టాండులో ఆరాతీశారు.

కాయ కష్టానికి ధర ఏదీ ?

అనంతపురం రూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): అనంత మార్కెట్‌కు చీనీ కాయలు పెద్ద ఎత్తున వస్తున్నాయి. గత మూడు నాలుగురోజుల నుంచి పన్నెండు వందల టన్నులకు పైగానే కాయలు వచ్చాయి. అయితే ధరలు లేకపోవడం రైతులను కలవరపెడుతోంది. టన్ను గరిష్ఠ ధర రూ.20వేల లోపే ఉంది. సీజనల్ కాయలు మార్కెట్‌కు ఎక్కువగా వస్తుండటంతో ధర పలకడంలేదని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఎగుమతులు తగ్గిపోవడం కూడా ధరల పతనానికి కారణమన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. శనివారం 1258 టన్నుల సీజనల్ కాయలు మార్కెట్‌కు వచ్చినట్లు యార్డు ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. గరిష్ఠంగా టన్ను రూ.18360, సరాసరి రూ.12,500, కనిష్ఠ ధర రూ.3వేలతో అమ్ముడుపోయాయన్నారు.

న్యూస్ బాక్స్

పాలపాటిదిన్నెలో ప్రత్యేక పూజలు


అలంకరణలో పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి

నల్లచెరువు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధిగాంచిన పాలపాటి దిన్నె ఆంజనేయస్వామిని అర్చకులు శనివారం ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. మూలవిరాట్‌కు అభిషేకాలు, అర్చనలు చేశారు. తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఉచిత భోజన వసతి కల్పించారు.

నేడు పీర్ల జలధి


నంబులపూలకుంటలో కొలువుదీరిన పీర్లు

నంబులపూలకుంట, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో, వంకమద్ది గ్రామంలో కొలువుదీరిన పీర్లు ఆదివారం జలధికి తరల నున్నట్లు ముజావర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయా చావిళ్ల వద్ద శనివారం రాత్రి అగ్నిగుండం ఏర్పాటు చేశారు. ఆదివారం తెల్లవారుజామున, తిరిగి సాయంత్ర పీర్లను గ్రామాల్లో ఊరేగించి జలధికి తరలిస్తామని వారు తెలిపారు.

● నల్లమాడ: మండలంలోని తిప్పయ్యగారిపల్లి, పెమనకుంట పల్లి, నల్లశింగయ్యగారిపల్లిల్లో ఆదివారం పీర్లను జలధికి తరలించ నున్నట్లు ఆయా గ్రామ పెద్దలు తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాల

అడ్డుకట్టకు పటిష్ట చర్యలు: డీఎస్పీ

పుట్టపర్తి రూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): సబ్‌డివిజన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాల అడ్డుకట్టకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు డీఎస్పీ విజయ్‌కుమార్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్పీ ఆదేశాలతో జిల్లా కేంద్రం పరిధిలో, మారుమూల గ్రామాల శివార్లలో డ్రోన్ కెమెరాతో నిఘా పెట్టినట్లు తెలిపారు. రూరల్ పరిధిలో కర్నాటకనాగేపల్లి, వీరజిన్నయ్యపల్లి ప్రాంతాలు, నిర్మానుష్య ప్రాంతాల్లో బహిరంగ మద్యసేవనం, గంజాయిసేవనం, పేకాట, ఈవ్‌టీజింగ్ వంటి కార్యకలాపాలపై రూరల్ ఎస్సై లింగన్న సిబ్బందితో గట్టి నిఘా ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు.

వ్యక్తిపై దాడి.. ఇద్దరిపై కేసు

ధర్మవరం, జూలై 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీచర్స్ కాలనీలో వ్యక్తిపై దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. టీచర్స్ కాలనీలోని అగ్నిగుండం వద్ద వన్నూర్, నరేశ్ డ్రమ్స్ కొడుతున్నారు. అయితే సరిగా కొట్టాలని బాషా అనే వ్యక్తి వారికి చెప్పాడు. అది మనసులో పెటుకుని వారు శుక్రవా రం రాత్రి బాషాపై కర్రలతో దాడిచేశారు. బాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

పొలాల్లో విద్యుత్ వైరు చోరీ

కదిరి అర్బన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరేపల్లి పేటలో పొలాల్లో మోటారు కోసం ఏర్పాటుచేసిన విద్యుత్ వైరును శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీచేశారు. గ్రామానికి చెందిన గంగిరెడ్డి, రామాంజనేయులు తమ పొలాలకు ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఆరు స్తంభాల ద్వారా లాగిన విద్యుత్ వైరును కత్తిరించి ఎత్తుకెళ్లారు. శనివారం పొలాలకు వెళ్లిన రైతులు గుర్తించి ఆందోళన చెందారు. ప్రస్తుతం పొలాల్లో మొక్కజొన్న సాగుచేశారు. దొంగలు ఎత్తుకెళ్లిన వైరు విలువ రూ. 25వేలు ఉంటుందన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు చెప్పారు.

హైవోల్టేజీతో కాలిపోయిన విద్యుత్ పరికరాలు

ఓబుళదేవరచెరువు, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పోలీస్‌లైన్ ప్రాంతంలో హైవోల్టేజీతో ఇళ్లలోని విద్యుత్ పరికరాలు కాలిపోయినట్లు శనివారం బాధితులు వాపోయారు. పోలీస్ స్టేషన్ ప్రాంతంలో నివాముంటున్న ఫైర్ రమణప్ప ఇంటిలో బోరు స్టార్టర్, బల్బులు, ఇన్వర్టర్, ఫ్యాన్లు కాలిపోయినట్లు తెలిపారు. అలాగే టీస్టాల్ శ్రీనివాసులు దుకాణంలో ఫ్రిడ్జ్, బల్బులు కాలిపోయినట్లు తెలిపారు. విద్యుత్ అధికారులు స్పందించి భవిష్యత్‌లో ఇలా హైవోల్టేజీ రాకుండా చూడాలని ప్రజలు కోరారు.

పీర్ల పండుగలో ఘర్షణ

● ఒకరికి తీవ్ర గాయాలు

తనకల్లు, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని సున్నంపల్లివాండ్లపల్లికి చెందిన భాస్కర్ శుక్రవారం రాత్రి పీర్లపండుగలో జరిగిన ఘర్షణలో తీవ్రగాయాలపాలైనట్లు ఎస్ఐ గోపి శనివారం తెలిపారు. మండలంలోని టి.సదుం గ్రామంలో జరుగుతున్న పీర పండుగకు పక్కగ్రామమైన సున్నంపల్లివాండ్లపల్లికి చెందిన భాస్కర్ స్నేహితులతో కలిసి వెళ్లాడు. అయితే ఓ చిన్న విషయలో భాస్కర్‌కు నల్లచెరువు మండలంలోని దేవరింటిపల్లికి చెందిన ఇస్మాయిల్‌తో వాగ్వాదం జరిగింది. ఆగ్రహానికి లోనైన ఇస్మాయిల్ పక్కనే ఉన్న పెద్ద కట్టెతో దాడి చేయగా, భాస్కర్‌కు తీవ్రగ్రా యాలయ్యాయి. అతడిని బంధువులు, స్నేహితులు కదిరి ప్రభుత్వ ఆసుప్రతికి తరలించి, అనంతరం మెరుగైన చికిత్సలకోసం బెంగళూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం పరిస్థితి విషయంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు. ఈసంఘటనపై భాస్కర్ తండ్రి వెంకటాచలపతి ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. సంఘటనాస్థలాన్ని ఎస్ఐ సిబ్బందితో వెళ్లి పరిశీలించారు.

గుండెపోటుతో డీవీఎంసీ సభ్యుడి మృతి


శ్రీనివాసులు (ఫైల్)

తనకల్లు, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గందోడివారిపల్లికి చెందిన సుండుపల్లి శ్రీనివాసులు (63) గుండెపోటుతో మృతిచెందారు. శ్రీనివాసులకు శుక్రవారం రాత్రి గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యంకోసం అన్నమయ్య జిల్లా మదనపల్లిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సలు పొందుతూ మృతిచెందినట్లు బంధువులు తెలిపారు. ఆయన ఎస్సీ, ఎస్టీ, జిల్లా విజిలెన్స్ మాన టరింగ్ సభ్యుడిగా మూడేళ్లుగా సేవలందిస్తున్నారు.

జనరేటర్‌లో చెలరేగిన మంటలు

కొత్తచెరువు, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ధర్మవరం ర హదారి పక్కన వ్యవసా య మార్కెట్‌యార్డ్ సమీపంలో జనరేటర్‌కు వెల్డిం గ్ పనులు చేస్తుండగా అకస్మాత్తుగా మంటలు ఎగిసి పడ్డాయి. జనరేటర్ కు వ్యాపించాయి. అనంతపురానికి చెందిన అశోక్ ప్రణవ్ జనరేటర్‌ను అద్దెకు ఇస్తుంటాడు. అతడి వద్ద నుంచి అద్దెకు తెచ్చుకున్న కొత్తచెరువుకు చెందిన వ్యక్తి తిరిగి అనంతపురం తీసుకెళ్తుండగా జనరేటర్‌కు ఉన్న ఇనుపరాడ్డు విరిగిపోయింది. దాన్ని వెల్డింగ్ చేయిస్తుండగా ఉన్నట్టుంటి మంటలు జనరేటర్‌కు వ్యాపించాయి. కేశాపురంలో ఎమ్మెల్యే చేపట్టిన కార్యక్రమం ముగించుకుని వస్తున్న సీఐ మారుతీశంకర్, సిబ్బంది వీరునాయక్, భాస్కర్ దాన్ని గమనించివెంటనే వాహనాన్ని నిలిపారు. పక్కనే ఉన్న వాటర్ సర్వీసు సెంటర్‌లోని నీటి పైపుతో మంటలను అదుపు చేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది.

గ్రాసం కోసం మూగజీవాల పాట్లు

● కనిపించని నైరుతి రుతుపవనాల ప్రభావం
● సాగుకు నోచుకోని వ్యవసాయ భూములు
● కనుచూపు మేర బీళ్లే


పచ్చిక లేకపోవడంతో బీడు భూముల్లో పరుగులు తీస్తున్న గొర్రెలు

నంబులపూలకుంట, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడువారాలు అయినా చినుకుజాడలేదు. కేవలం గాలి వీస్తోంది. దీంతో వర్షాధార పంటలు సాగుచేయలేకపోతున్నారు. కనుచూపు మేర బీళ్ల కనిపిస్తున్నాయి. మండల వ్యాప్తంగా ప్రతియేడాది 15వేల ఎకరాల్లో పంట సాగయ్యేది. ఈ ఖరీఫ్‌లో బోరుబావుల కింద రెండువేల ఎకరాల్లో మాత్రమే సాగుచేశారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో బోర్లలో నీరు అడుగంటి పోతుండడంతో సాగు చేసిన పంట చేతి కొస్తుందో లేదో అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలాఉంటే మండలంలో ఎక్కువగా మూగజీవాలపైన ఆధారపడి జీవించే కుటుంబాలు చాలా ఉన్నాయి. వ్యవసాయంపై ఇప్పటికే చాలా నష్టపోయిన రైతులు అప్పులు చేసి గొర్రెలు, మేకల పెంపకం చేపట్టారు. అయితే చినుకుజాడలేక గ్రాసం మొలకెత్తలేదు. ఎండుగడ్డి సైతం చెదలు పట్టింది. మూగజీవాలను ఏవిధంగా కాపాడాలని కాపరులు ఆందోళన చెందుతున్నారు. దీంతో గ్రాసం దొరికే ఊళ్లకు వెళతున్నారు. మండల వ్యాప్తంగా 1. 60లక్షల గొర్రె లు, మేకలు, 9,400 ఆవులు, గేదెలు ఉన్నట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. రోజులో కనీసం ఎనిమిది గంటలైనా వాటిని పొలాల్లో మేపాలి. వాటిని ఇంటివద్ద ఉంచుకుని గ్రాసం కనుగోలు చేసి పోషించే పరిస్థితులు లేవు. మండలకేంద్రంలోని ప్రభుత్వ భూముల్లో ఏడు వేల ఎకరాల్లో సోలార్ నిర్మాణం చేపట్టారు. దీంతో మూగజీవాల మేతకు కొండలు, గుట్టలు కరువు కావడంతో బీళ్లపైనే ఆధారపడాల్సి ఉంది. ఎక్కడైనా బోర్ల కింద సాగు అవుతున్న పొలాల్లో కనిపించిన పచ్చికన మేయడానికి మూగజీవాలు పరుగులు తీస్తున్నాయి. అయితే కాపరులు ఏమాత్రం ఆదమరిచినా పంట పొలాల్లోకి వెళ్లిపోతున్నాయి. పంటలు మేయడంతో రైతులు బాధపడుతున్నారు.

కాపరుల అవస్థలు

మూగజీవాల కోసం కాపరులు రబీలో రైతులకు చేతికొచ్చిన వేరుశనగ పొట్టును ట్రాక్టర్ రూ.20వేలతో కొనుగోలుచేశారు. ఆ గ్రాసం ప్రస్తుతం అయిపోయింది. ఇప్పుడు చినుకు జాడలేకపో వడంతో నష్టానికైనా మూగజీవాలను విక్రయించడానికి సిద్ధమయ్యారు. అయితే వాటిని కొనేవారు లేరని వాపోతున్నారు. మరికొందరు మండలం వదిలి, అన్నమ య్యజి ల్లాలో వర్షం కురిసిన ప్రాంతాలకు మూగజీవాలను మేతకు తోలుకెళ్తున్నారు.

గడ్డి ఉందని వచ్చాం



మా ఒక కుటుంబానికే వందకుపైగా గొర్రెలు ఉన్నాయి. మా గ్రామంలో పచ్చిక లేకపోవడంతో వలస వచ్చాం. కుటుంబమంతా ఇక్కడే స్థావరం ఏర్పాటుచేసుకుని గొర్రెలను మేపడానికి వచ్చాం. ఇక్కడ పచ్చిక లేకపోవ డంతో, ఇతర ప్రాంతాలకు వెళ్లడానికి సిద్ధమవుతున్నాం. ఈ గొర్రెలే మా కుటుంబాలకు జీవనాధారం, ఎలాగైనా గొర్రెలను కాపాడుకోవాల్సి ఉంది. స్థావరాలు మార్చుకుంటూ వలస ప్రయాణం చేపట్టాం. - ప్రసాద్, తనకల్లు మండలం

అప్పుచేసి గొర్రెలు కొనుగోలు చేశా



నేను రోజువారీ కూలి పనులు చేసుకుని జీవనం సాగించేవాడిని. ప్రస్తుతం ఆరోగ్యం సహరించక రూ.55వేలు అప్పు చేసి 11 గొర్రెలను కొనుగోలుచేశా. వీటితో ఎలాగైనా జీవనం సాగించవచ్చని ఆశపడ్డా. నెలరోజులుగా వర్షాలు పడకపోవడంతో, బీడుభూముల్లో కూడా పచ్చిక లేదు. ఎండుగ్రాసం కొనుగోలుచేసే ఆర్థిక స్తోమతలేదు. దీంతో పగటిపూట అయినా కడుపునిండా పచ్చిక మేస్తాయని ఎంతో ఆశతో సుదూర ప్రాంతాలకు తోలుకెళ్తున్నాం. ఈ ప్రాంతంలో ఇక్కడ పచ్చిక లేకపోవడంతో పక్కనే ఉన్న అన్నమయ్యజిల్లాలో వర్షాలు పడిన ప్రాంతానికి గొర్రెలను తోలుకెళ్లేందుకు సిద్ధమవుతున్నాం. - రామక్రిష్ణ, ఎన్పీకుంట

ప్రజలే నా బలం

● వారి వెంట నా అడుగులు: మంత్రి సత్యకుమార్
● ధర్మవరంలో రెండో రోజు పాదయాత్ర


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి సత్యకుమార్, పరిటాలశ్రీరామ్, చిలకం మధు

ధర్మవరం, జూలై 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ పట్టణంలో చేపట్టిన పాదయాత్ర రెండో రోజు శనివారం ప్రజాభిమానంతో కొనసాగింది. ఇందిరానగర్, పీఆర్‌టీ వీధుల్లో మంత్రి సత్యకుమార్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి, శాసన మండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియా ఖానమ్ పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఇందిరానగర్‌లో మంత్రి ఓ లాం డ్రి దుకాణం వద్ద ఇస్త్రీపెట్టె పట్టుకుని ఇస్త్రీ చేశారు. అలాగే పీఆర్‌టీ వీధిలో చేనేత మగ్గంగుంతలోకి దిగి స్వయంగా మగ్గం నేశారు. చేనేతల సమస్యలను పరిష్కరించి, పరిశ్రమకు పూర్వవైభవం తెస్తానన్నారు. ఈ సందర్భంగా స్థానికులు సీసీరోడ్లు, డ్రైనేజీ, జింగిల్ క్లియరెన్స్, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు తదితర సమస్యలపై మంత్రికి వినతులు అందజేశారు. గాంధీనగర్‌లో రైల్వే లైన్ పక్కన ఉన్న ఇంటి స్థలాలకు ప్రహరీ నిర్మించాలని కోరారు. గాంధీనగర్ రైల్వే గేటు సమీప ప్రాంతంలో చెట్లు పెరిగి, చెత్తపేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోందని, దోమల బెడద ఉందని స్థానికుల విన్నవించగా మంత్రి తక్షణమే స్పందించారు. ఎక్సవేటర్‌ను రప్పించి చెత్తను పూర్తిగా తొలగించి శుభ్రంచేయించారు. అలాగే సత్యసా యి వాటర్ సప్లై కార్మికులు మంత్రిని కలిసి మూడునెలలుగా వేతనాలు అందలేదని విన్నవించారు. వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను మంత్రి సీరియస్‌గా ఆదేశించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... గత ఏడాది ఏపీలో ప్రజలకు దక్కిన విజయాన్ని జూన్ నెలలోనే దీపావళి వచ్చినట్టుగా ఉందన్నారు. అది ఆటవిక పాలనకు ముగింపు, ప్రజా పాలనకు ఆరంభం అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, దేశంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వం సాధిస్తున్న విజయాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్, ఏపీసీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, టీడీపీ నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ చింతలపల్లి మహేశ్ చౌదరి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, నాయకులు నాగూర్ హుస్సేన్, సంధా రాఘవ, భీమనేని ప్రసాద్ నాయుడు, రాళ్లపల్లి షరీఫ్, కత్తుల బాబ్జీ, రాంపురం శీన, కేశగాళ్ల శీన, భాస్కర్‌చౌదరి, బీజేపీ పట్టణ అధ్యక్షుడు జింకా చంద్ర, రూరల్ అధ్యక్షుడు గొట్లూరు చంద్ర, జిల్లా ఉపాధ్యక్షుడు సాకే ఓబుళేశు, జనసేన పట్టణ అధ్యక్షుడు అడ్డగిరి శ్యాంకుమార్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సుపరిపాలన మనందరి బాధ్యత

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న పరిటాలశ్రీరామ్

తాడిమర్రి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని విజయవం తం చేయడం మనందరి బాధ్యత అని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ అన్నారు. మండలంలోని శివంపల్లి బీసీ కాలనీలో శనివారం సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. హాజరైన పరిటాలశ్రీరామ్‌కు మండల కన్వీనర్ కూచి రామ్మోహన్, హర్ష ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికి వెళ్లి ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. పథకాలు రాని వారి వివరాలు నమోదు చేసుకుని త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం శివంపల్లిలో బూత్ కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లాలని, ఎవరైన నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే పార్టీ ఉపేక్షించదన్నారు. ఆయన స్వయంగా సుపరిపాలన తొలిఅడుగు సర్వే నిర్వహించి గ్రామస్థుల ఫొటో తీసి వివరాలను నమోదు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పతకమూరి జనార్దన్, రాజశేఖర్, విశ్వనాథ్, సాయి, శ్రీనివాస రెడ్డి, కుళ్లాయరెడ్డి, రవీంద్రారెడ్డి, ఫక్కీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలోనే సంక్షేమం, అభివృద్ధి

● ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్


18వ వార్డులో ఇంటింటా ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, జూలై 12(ఆంధ్రజ్యోతి): కూటమి యేడాది పాలనలో కనీవిని ఎరుగని రీతిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంక్షేమపథకాలు, అభివృద్ధి అమలుచేశారని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. సురిపాలనకు తొలిఅడుగు కార్యక్రమాన్ని ఆయన శనివారం మున్సిపాలిటీలోని 18వార్డులో నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి కరపత్రాల ద్వారా కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. ఆయనతో పాటు టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహణ కార్యదర్శి పవన్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ దిల్షాదున్నీషా, బాహుద్దీన్, సలాంబీడి ఇస్మాయిల్, కౌన్సిలర్లు సీఏ ఇస్మాయిల్, మహబూబ్‌బాషా, నాయకులు ఉట్టి ఓంప్రకాష్, బండారు మురళి, శిరి బాబాయ్య, సీఏ ఫారూక్, ఇర్ఫాన్, ఇస్మాయిల్, జీకే జాఫర్‌వలి, నజరుల్లా, ప్లేవుడ్ ఇదయతుల్లా, తజ్మూల్, పఠాన్ నూర్, బాబ్‌జాన్, జబ్బార్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలి: సీపీఎం

కదిరి అర్బన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇళ్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండలంలోని సైదాపురం సర్వే నంబర్ 294లోని ప్రభుత్వ భూమిలో సీపీఎం ఆధ్వర్యంలో జెండాలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు ఇళ్లస్థలాలు ఇవ్వాలని ఐదు నెలలుగా గ్రామ సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయం, జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వద్ద ఆందోళనలు చేశామన్నారు. అయినా అధికారులో చలనం లేదన్నారు. రోజువారీ కూలితో జీవనం సాగించే పేదలు ఇంటి అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. పేదలకు కొత్త అమీన్‌నగర్‌లోని ప్రభుత్వ భూమిలో ఇంటిస్థలాలు కేటాయించాలన్నారు. ఈ భూమిలో గుడిసెలు వేసుకుంటున్నామని, అందరికి పట్టాలివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు జీఎల్ నరసింహులు, సాంబశివ, బాబ్‌జాన్, రామమోహన్, నారాయణ, ముస్తాక్, రఫీ, ఉదయ్, శంకర్‌రెడ్డి, పట్టణ పేదలు పాల్గొన్నారు.

విధ్వంసమే వైసీపీ సిద్ధాంతం: ఎమ్మెల్యే

కదిరి, జూలై 12(ఆంధ్రజ్యోతి): విధ్వంసమే వైసీపీ సిద్ధాంతమని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ విమర్శించారు. ఆయన శనివారం పట్టణంలోని తన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ సీఎం జగన్, మాజీ మంత్రి పెర్నినానీపై ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రప్పారప్పా చేసేయండి, చీకటిలో కనుసైగ చేస్తే జరిగిపోవాలి' అని పెర్నినానీ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర స్థాయంలో మండిపడ్డారు. ప్రజావేదికతో కూల్చివేతతో ప్రా రంభమైన మీ విధ్వంసం, మామిడికాయలను తొక్కించేంత వరకు కొనసాగుతోందన్నారు. ఎవర్నీ భయపెట్టాల్సిన అవసరంగానీ, కక్ష సాధింపులకు పాల్పడాల్సిన అవసరం గానీ తమ ప్రభుత్వానికి లేదన్నారు. వ్యవస్థలను నడిపే క్రమంలో ఏ పార్టీ వారైనా శిక్షించే అధికారం ఉంటుం దన్నారు. రీకాల్ మ్యానిఫెస్టో ఎందుకని ప్రశ్నించారు. రూ.4వేలు పింఛన్ పెంచినందుకా, ఉచిత గ్యాస్‌లిండర్లు ఇస్తున్నందుకా, ఇంటిలో ఎంతమం ది చదువుకుంటుంటే అందరికి తల్లికి వందనం ఇచ్చినందుకా అని ప్రశ్నించారు.

అక్రమంగా ఆవుల తరలింపు

● అడ్డుకున్న గ్రామస్థులు


కంటైనర్లను అడ్డుకున్న గ్రామస్థులు

నల్లచెరువు, జూలై 12(ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఆవులను తరలిస్తున్న మూడు కంటైనర్లు, ఒక లారీని శనివారం మండలపరిధిలోని పెద్ద యల్లంపల్లి వద్ద ఆ గ్రామస్థులు అడ్డుకున్నారు. పెద్ద యల్లంపల్లి వద్ద వెళ్లే వాహనాలకు లారీకి ఇంత అని కొందరు డబ్బులు వసూలు చేస్తుండగా గ్రామస్థులు వెళ్లి ఎందుకు డబ్బులు వసూలుచేస్తారని ప్రశ్నించారు. రూట్ మెయింటెనెన్స్‌కు అని వారు చెప్పారు. కంటైనర్లలో ఏమి ఉన్నాయని ప్రశ్నించగా ఆవులు ఉన్నట్లు చెప్పారు. వాటిని కేరళకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఒక కంటైనర్‌కు రూ. పదివేలనుంచి 20వేలు వసూలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ డబ్బు ఎవరికి వెళ్తుందని ప్రశ్నించగా, ఉప్పార్లపల్లికి చెందిన ఓ దళారికి చేరుతుందని సమాధానమిచ్చారు. ఆవులను తరలించడంపై గ్రామస్థులు ఆగ్రహించి, రోడ్డుపైనే నిలబడి డీఎస్పీ, ఎస్ఐకి ఫోన్ చేసి సమాచారమిచ్చారు. రోజుకు 10నుంచి 15 కంటైనర్లు తరలిస్తున్నట్లు దళారి తెలిపారు. మరో కంటైనర్‌ను ఆపాడానికి ప్రయత్నించగా, వేగంగా ప్రజల వైపు నుంచి దూసుకెళ్లిపోయిందని గ్రామస్థులు మండిపడ్డారు.

భక్తి శ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతం


ఏడు శనివారాల వ్రతంలో పాల్గొన్న మహిళలు

ధర్మవరం, జూలై 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో వెలసిన లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సామూహిక ఏడు శనివారాల వ్రతాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు రాజేశ్ స్వామి వారి మూలవిరాట్‌ను వివిధ పూలు, పట్టువస్త్రాలు, తులసి హారంతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహిళలు ఏడు శనివారాల వ్రతంలో భాగంగా మొదటి శనివారం పూజ ఆచరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు చెన్నంశెట్టి జగదీశ్వరప్రసాద్, ప్రధాన కార్యదర్శి జింకా రాజేంద్ర ప్రసాద్, సభ్యులు చెన్నంశెట్టి శ్రీనివాసులు, చెన్నంశెట్టి రమేశ్ పాల్గొన్నారు.

హామీలను నెరవేరుస్తున్న సీఎం

● 'సుపరిపాలనకు తొలిఅడుగు'లో ఎమ్మెల్యే సింధూర రెడ్డి


కేశాపురంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

కొత్తచెరువు, జూలై 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ గత ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల సుడిగుండంలోకి నెట్టేసిందని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి విమర్శించారు. ఏ శాఖలో చూసినా ఒక్క పైసా కూడా మిగల్చకుండా ఆ పాలకులు దోచేశారని మండిపడ్డా రు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్ని ఆర్థిక కష్టాలున్నా, వాటిని అధిగమించి ఎన్నికలలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతూ ప్రజల మన్నలను పొందుతున్నారని అన్నారు. మండలంలోని కేశాపురం పంచాయతీలో శనివారం సుపరి పాలనకు తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేతో పాటు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికివెళ్లి అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి సాలక్కగారి శ్రీనివాసులు, టీడీపీ పట్టణ కన్వీనర్ ఒలిపి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, నాయకులు భాగ్యలక్ష్మి, సాయికుమార్, శంకర, శివ, బూత్ కన్వీనర్‌లు, యూనిట్ క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం చంద్రబాబు లక్ష్యం


24వ వార్డులో ఇంటింటా కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరం, జూలై 12(ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమమే సీఎం చంద్రబాబు లక్ష్యమని టీడీపీ 23, 24వ వార్డుల కో ఆర్డినేటర్ మాధవరెడ్డి పేర్కొన్నారు. సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా 24వ వార్డులో శనివారం ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేస్తూ ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, అందించిన పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకు లు సురేశ్, జిలాన్, గోపాల్, నారాయణస్వామి, బిల్లే రాజ పాల్గొన్నారు.


నంబులపూలకుంటలో...

నంబులపూలకుంట, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన నంబులపూలకుంటలో శనవారం సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు దండె రవిశంకర్, పాలగిరి బాషా, మౌలాసాబ్, ఆదినారాయణ, బాబ్‌జీ, దండోరా రెడ్డెప్ప, మగ్గం రామాంజి, సలీం, చింతా శీనా, రవి, తదితరులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు.


ముదిగుబ్బలో...

ముదిగుబ్బ, జూలై 12(ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని శనివారం మండల కేంద్రంలోని 13వ వార్డులో నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై వివరించారు. టీడీపీ మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయండి

ఓబుళదేవరచెరువు, జూలై 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఈ నెల 31నుంచి ఆగస్టు 1వరకు జరిగే సీపీఐ జిల్లా రెండో మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల నాయకులు కోరారు. శనివారం మహా సభల పోస్టర్లను విడుదల చేశారు. మండల సహాయ కార్యదర్శి సుధాకర్, రవికుమార్, రామచంద్ర, వెంకటేష్, దేవేంద్ర, రేణుక, తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం చైర్మన్‌కు సన్మానం


బోయపల్లి శివారెడ్డిని సన్మానిస్తున్న టీడీపీ నాయకులు, ప్రజలు

ఓబుళదేవరచెరువు, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లాపల్లి సహకార సంఘం చైర్మన్‌గా నియమితులైన బోయపల్లి శివారెడ్డిని శనివారం టీడీపీ నాయకులు, ప్రజలు ఘనంగా సన్మానించారు. బోయపల్లిలోని ఆయన నివాసంలో దుశ్శాలువ, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారంతో పాటు రైతులకు విరివిగా రుణాలు అందించి, వ్యవసాయాభివృద్ధికి కృషిచేస్తామన్నారు ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆర్ఎంపీ క్రిష్ణమూర్తి, రాజగోపాల్, డీలర్ శివనారాయణ, మల్లెల రమేష్, రమణ, పలక గంగన్న, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

నేడు చంద్రమౌళీశ్వరుడికి

సహస్రఘట కుంభాభిషేకం



ప్రత్యేక అలంకరణలో చంద్రమౌళీశ్వరుడు

మడకశిర టౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పావగడ రోడ్డులో వెలసిన చంద్రమౌళీశ్వర దేవాలయంలో ఆదివారం సహస్రఘట కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా చంద్రమౌళీశ్వరుడికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సహస్రఘటిక కుంభాభిషేకం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. వర్షం సమృద్ధిగా కురవాలని ప్రత్యేకంగా ఈ పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ప్రత్యేక పూజలు, హోమాలు, అలంకరణలు ఉంటాయని, భక్తులు జయప్రదం చేయాలని ఆలయ కమిటీ కోరింది.

రైతుకు స్ప్రింక్లర్ల అందజేత



స్ప్రింక్లర్లను రైతుకు అందజేస్తున్న అధికారి నరసింహప్ప

మడకశిర రూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఈచలడ్డి గ్రామానికి చెందిన రైతు రేవణ్ణకు స్ప్రింక్లర్లను శనివారం అధికారులు అందజేశారు. స్ప్రింక్లర్ల కోసం రైతు రేవణ్ణ రూ.12500 డీడీని జనవరిలో డీలర్‌కి ఇచ్చారు. ఆరు నెలలు గడిచినా రైతుకు స్ప్రింకర్లు అందజేయలేదు. ఈ నేపథ్యంలో 'అందని స్ప్రింక్లర్లు... ఎండుతున్న పంట' శీర్షికన ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రచురించింది. స్పందించిన ఏపీఎంఐపీ డివిజనల్ అధికారి నరసింహప్ప డీలర్‌తో కలిసి ఈచిలేడి గ్రామానికి వెళ్లి రైతుకు స్ప్రింక్లర్లు అందజేశారు. అనంతరం నరసింహప్ప మాట్లాడుతూ డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం రైతులు డీడీలు ఇచ్చిన వెంటనే పంపిణీ చేయాలని ఆదేశించారు. లేనిపక్షంలో డీలర్లపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

కర్ణాటక సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన



అధికారులతో సమావేశమైన హోంమంత్రి పరమేశ్వర్

పావగడ, జూలై 12(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్దరామయ్య ఈనెల 21న పావగడలో పర్యటించనున్న నేపథ్యంలో శనివారం హోంమంత్రి పరమేశ్వర్ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో హోమంత్రి మాట్లాడుతూ సీఎం పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించడం జరిగిందన్నారు. రూ. 450 కోట్లకు సంబంధించి అభివృద్ధి, సంక్షేమ పథకాలను సీఎం ప్రవేశపెట్టనున్నారని వివరించారు. సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహాలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. సీఎం పర్యటనకు సంబంధించి అధికారులకు సలహాలు, సూచనలు ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం వ్యవసాయ, అటవీ, సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయాల ప్రగతి పనులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో కలెక్టర్ శుభకల్యాణి, ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉత్సవాలు ఘనంగా నిర్వహించండి

మంత్రి సవితకు బలిజ కులస్థుల వినతి



మంత్రి సవితకు వినతిపత్రం అందజేస్తున్న బలిజ కులస్థులు

పెనుకొండ టౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయల పట్టాభిషేక మహోత్సవాలను ఆగస్టులో ఘనంగా నిర్వహించాలని పెనుకొండ బలిజసంఘం అధ్యక్షులు సూరీ కోరారు. శనివారం పెద్దఎత్తున బలిజ కులస్థులు మంత్రి సవితను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయల ఉత్సవాలకు సంబంధించి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి ఘనంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రంలో బలిజలకు సముచిత స్థానం కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు

ఇరిగేషన్ డీఈ లక్ష్మీనారాయణ

గోరంట్ల, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెరువులు, కుంటలనుంచి ప్రభుత్వ అనుమతిలేకుండా అక్రమంగా మట్టి తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఇరిగేషన్ డీఈ లక్ష్మీనారాయణ హెచ్చరించారు. గోరంట్లలోని పెద్దచెరువు నుంచి ఇటుక పరిశ్రమ యజమానులు అక్రమంగా మట్టితరలిస్తున్నారన్నారు. రాత్రి సమయంలో మట్టిని యంత్రాలు, వాహనాల్లో తరలిస్తున్నారని, చెరువును శనివారం పరిశీలించగా మట్టి తరలించిన ఆనవాళ్లు కనిపించాయన్నారు. ఇలాంటి చర్యలకు పాల్పడితే మట్టి తరలించే వాహనాలను సీజ్‌చేసి, పోలీసులకు ఫిర్యాదుచేస్తామని హెచ్చరించారు.

యువతి ఆత్మహత్యాయత్నం

గోరంట్ల, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని శెట్టిచిన్నంపల్లికి చెందిన శిల్ప శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. కుటుంబంలో నెలకొన్న మనస్పర్థల కారణంగా ఆత్మహత్యాయత్నం చేసుకుంది. గోరంట్ల ఆసుపత్రికి తీసుకెళ్లగా డాక్టర్ ఉషా చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం 108లో హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

గస్తీకి స్వస్తి..!

- రాత్రిపూట మోగని పోలీసు సైరన్
- కనిపించని ఖాకీలు
- హెచ్చుమీరిన చోరీలు, నేరాలు
- బెంబేలెత్తుతున్న జనం



హిందూపురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇటీవలిగా వరుస చోరీలు జరుగుతున్నాయి. నిత్యం ఎక్కడో ఒకచోట నేరాలకు పాల్పడుతున్నారు. దొంగలు, నేరస్థులు పేట్రేగిపోతున్నారు. ఇందుకు ప్రధాన కారణం పోలీసుల గస్తీ కరువవడమేనని జనం వాపోతున్నారు. రాత్రిపూట పోలీసు వినిపించటమే లేదనీ, ఎక్కడా ఖాకీలు కనిపించట్లేదని వారు ఆవేదన చెందుతున్నారు. పట్టణంలో గస్తీని అటకెక్కించారన్నది బహిరంగ సత్యం. ఇందుకు కారణాలు ఏవైనా రాత్రిపూట పోలీసులు రోడ్డెక్కకపోవడంతోనే నేరాలు అదుపులోకి రావడంలేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. హిందూపురం ప్రాంతంలో ఇటీవలిగా వరుస నేరాలు జరుగుతుండడమే ఇందుకు నిదర్శనం.

కొరవడిన పెట్రోలింగ్

నేరాలను అదుపు చేయాలంటే రాత్రిపూట పోలీసుల గస్తీ కీలకం. ఇందులో భాగంగా కొంతమంది సిబ్బంది ఆలయాలు, ప్రార్థనా మందిరాల వద్ద, మరికొంతమంది సిబ్బంది ముఖ్యమైన ప్రాంతాల్లో గస్తీ తిరిగేవారు. అప్పట్లో ద్విచక్రవాహనాల్లో పోలీసులు వెళ్లేవారు. గస్తీని ఎస్పీతోపాటు డీఎస్పీలు తనిఖీ చేసేవారు. ఏరోజుకారోజు సిబ్బందిని ప్రధాన ప్రాంతాల్లో గస్తీకి వేసేవారు. డీఎస్పీ, ఎస్పీలు తనిఖీచేసి గస్తీ ప్రాంతంలో ఉండని సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకునేవారు. ప్రస్తుతం సిబ్బంది తప్పులు చేసినా వారిపై చర్యలు తీసుకునేందుకు పోలీసు అధికారులు జంకుతున్నారు. దీనిని ఆసరాగా చేసుకుని నేరస్తులు రెచ్చిపోతున్నారు. ఉన్నతాధికారులు తనిఖీలను అటకెక్కించడంతో కింది స్థాయిలో సిబ్బంది గస్తీకి తిలోదకాలిచ్చారన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. సిబ్బంది కొరతతోనే పెట్రోలింగ్ నిర్వహించలేకపోతున్నామని పోలీసు అధికారుల చెబుతున్నారు. సిబ్బంది లేరని పెట్రోలింగ్‌కు స్వస్తి పలకడం ఏంటన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఉన్న సిబ్బందితోనే నెట్టుకొస్తున్నాం



హిందూపురం సబ్ డివిజన్‌లో సిబ్బంది కొరత ఉంది. ఉన్నవారితోనే నేరాల అదుపునకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలు కూడా పోలీసుల సూచనలు పాటించాలి. భవంతులు నిర్మించుకున్నవారు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే కొంతమేర నేరాలు తగ్గించవచ్చు.

- మహేష్, డీఎస్పీ



వర్షాకాలంలో పెద్దవంకలో నీరు పారుతున్న దృశ్యం (ఫైల్)



శరవేగంగా జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణం పనులు

నెరవేరనున్న దశాబ్దాల కల

- శరవేగంగా డీఆర్ కొట్టాల బ్రిడ్జి నిర్మాణ పనులు

రొద్దం, జూలై 12(ఆంధ్రజ్యోతి): దశాబ్దాలకాలంగా డీఆర్ కొట్టాల గ్రామానికి పెద్దవంక దాటడానికి బ్రిడ్జిలేక తీవ్ర ఇబ్బందులు పడుతుండగా వారి కల సాకారమైంది. రొద్దం మండల పరిధిలోని డీఆర్ కొట్టాల గ్రామంలో కమ్మ సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు మాత్రమే ఉన్నాయి. ఎన్నోఏళ్లుగా బ్రిడ్జిలేక వర్షాకాలంలో పెద్ద వంక వస్తే ఎటూ వెళ్లలేక నానా అవస్థలు పడ్డారు. ప్రభుత్వాలు మారినా వారి సమస్య పరిష్కారం కాలేదు. రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత వారి సమస్యను స్వీకరించి బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.3కోట్లు నిధులు మంజూరు చేశారు. రెండునెలల క్రితం భూమిపూజ చేపట్టారు. శరవేగంగా పనులు జరుగుతున్నాయి. దీంతో గ్రామస్థుల ఆనందానికి అవధులులేకుండా పోయాయి. దశాబ్దాల కల నెరవేరినందుకు టీడీపీ నాయకులు ధర్మపాల్, మాజీ సర్పంచ్ హైటెక్ రామక్రిష్ణ మంత్రి సవితకు కృతజ్ఞతలు తెలిపారు.

జయప్రదం చేయండి

తొగట వీరక్షత్రియ సంఘం అధ్యక్షుడు సీసీహరి

సోమందేపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): చౌడేశ్వరి అమ్మవారి జయంత్యుత్సవాన్ని ఈనెల 25వ తేదీన నిర్వహిస్తున్నామని, జయప్రదం చేయాలని తొగటవీరక్షత్రియ సంఘం అధ్యక్షులు సీసీహరి కోరారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతియేటా మాదిరి ఈ ఏడు ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. అమ్మవారికి బోణాలు సమర్పించేందుకు వెయ్యి కుండలను సిద్ధంగా ఉంచామని, మహిళలు బోనాలు సమర్పించేందుకు ముందుకువచ్చి తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఎన్టీఆర్ కూడలి నుంచి బోనాలతో ఊరేగింపు ఉంటుందన్నారు. గత యేడాది నుంచి బోనాలు సమర్పించడం జరుగుతోందన్నారు. అమ్మవారి జయంత్యుత్సవానికి ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలిరానున్నారని వివరించారు.

31న జిల్లా మహాసభ

సీపీఐ కార్యదర్శి కనిశెట్టిపల్లి వినోద్

హిందూపురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): జిల్లా మహాసభను ఈనెల 31న నిర్వహిస్తున్నామని, జయప్రదం చేయాలని సీపీఐ కార్యదర్శి కనిశెట్టిపల్లి వినోద్ పిలుపునిచ్చారు. ధర్మవరంలో జిల్లా మహాసభలు జరుగనున్నాయన్నారు. దీనికి హిందూపురం ప్రాంతం నుంచి అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. అదేవిధంగా ఈనెల 15న హిందూపురం పట్టణంలో మహాసభ జరుగనుందని దీనికి నియోజకవర్గంలోని సీపీఐ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలన్నారు. ఈ సందర్భంగా సీపీఐ పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా సమీవుల్లా, కమల్‌బాష, ఇమ్రాన్, కార్యదర్శులు, మరికొంతమంది సహాయ కార్యదర్శులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో మారుతిరెడ్డి, చలపతి, జబీవుల్లా పాల్గొన్నారు.

ఆలయానికి విరాళం

హిందూపురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): కొట్నూరు ఇందిరమ్మ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి టీడీపీ నాయకులు చంద్రమోహన్ రూ.10వేలు కమిటీ సభ్యులకు అందజేశారు. కమిటీ సభ్యులు చంద్రమోహన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

విజయవంతం చేయండి

- టీడీపీ నాయకులు

అమరాపురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే పర్యటన ఈనెల 16వ తేదీన ఉంటుందని, విజయవంతం చేయాలని దళిత నాయకులు జయకుమార్, నారాయణ, నరసింహమూర్తి తదితరులు పిలుపునిచ్చారు. శనివారం వారు మండల కేంద్రంలోని అంబేడ్కర్ స్మృతివనంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రహరీ గోడ నిర్మాణ పనులకు భూమి పూజ చేసేందుకు ఎమ్మెల్యే వస్తున్నారన్నారు. ఎమ్మెల్యేతోపాటు ఎంపీ పార్థసారథి, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి హాజరవుతారన్నారు. నాయకులు, కార్యకర్తలు జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో కెంచప్ప, జెకెమూర్తి, ఆటో తిప్పయ్య , చెన్నప్ప, దేవరాజు పాల్గొన్నారు.

తీర్థ యాత్రలకు ఆర్టీసీ బస్సు

జెండా ఊపి ప్రారంభించిన డీఎం



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న డీఎం శ్రీకాంత్

హిందూపురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): హిందూపురం డిపో నుంచి రామేశ్వరం యాత్రకు ఆర్టీసీ బస్సు శనివారం బయలుదేరి వెళ్లింది. ఈ సందర్భంగా డిపోమేనేజర్ శ్రీకాంత్ జెండా ఊపి బస్సును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాణిపాకం, వేలూరు, గోల్డెన్ టెంపుల్, అరుణాచలం, శ్రీరంగం, మధురై, రామేశ్వరం పుణ్యక్షేత్రాలకు వెళ్లి రావడం జరుగుతుందన్నారు. హిందూపురం ప్రాంతంలోని ప్రజలు ఇలాంటి బస్సు సర్వీసులను సద్వినియోగం చేసుకుంటే తరువాత కూడా తీర్థయాత్రలకు బస్సులు పంపడం జరుగుతుందన్నారు. ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమని తీర్థయాత్రకు వెళ్లే భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య బృందం

హిందూపురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కగ్గల్లులో శనివారం క్షయవ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న వైద్య బృందం మాట్లాడుతూ క్షయ వ్యాధి రావడానికి ప్రధాన కారణాలు పొగతాగడం, మద్యం సేవించడమేనన్నారు. షుగర్ వ్యాధిగ్రస్థులు 60ఏళ్లు పైబడినవారికి వస్తుందని, వైద్యుల సూచనలు పాటిస్తే వ్యాధికి దూరంగా ఉండవచ్చని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి టీబీ యూనిట్ సూపర్‌వైజర్ గౌస్‌పీరా అన్నారు.

భీమలింగేశ్వర వైభవం

కన్నుల పండువగా రథోత్సవం

వేలాది భక్తులతో కిక్కిరిసిన గడేకల్లు

విడపనకల్లు మండలం గడేకల్లులో వేములవాడ భీమలింగేశ్వర స్వామి మహా రథోత్సవం శనివారం కన్నుల పండువగా సాగింది. స్వామి వారిని ఉదయం ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భీమలింగేశ్వరుడికి ప్రీతిపాత్రమైన మద్యాన్ని, మాంసాన్ని నైవేద్యంగా సమర్పించారు. వేడుకల్లో భాగంగా శనివారం తెల్లరుజామున స్వామివారి ఉత్సాయాన్ని ఆలయం వద్ద నుంచి గ్రామ చావిడి వరకూ లాగారు. అర్చకులు, వేద పండితులు సాయంత్రం స్వామి వారి ఉత్సవమూర్తిని, సంజమ్మ అవ్వ ఉత్సవ మూర్తిని ఆలయ వీధుల్లో పల్లకిలో ఊరేగించారు. మేళ తాళాల నడుమ ఆలయం ముందు ఉన్న మంటపానికి చేర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను రథంలో కొలువుదీర్చారు. అనంతరం మహా రథోత్సవం ప్రారంభమైంది. ఆలయం వద్ద నుంచి గ్రామంలోని బొడ్రాయి వరకూ, అక్కడి నుంచి తిరిగి ఆలయం వద్దకు రథాన్ని లాగి.. వేడుకలను ముగించారు. కర్నూలు, బళ్లారి, అనంతపురం, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు రథోత్సవానికి తరలివచ్చారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనాలలో భక్తులు తరలివచ్చి, స్వామి వారిని దర్శించుకున్నారు. గడేకల్లు గ్రామం భక్తులతో కిక్కిరిసి పోయింది. సీఐలు మహానంది, రాజు, ఎస్ఐలు ఖాజా హుస్సేన్, జనార్దననాయుడు, శివ, నాగస్వామి, మురాహరి, బందోబస్తు నిర్వహించారు. గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు వేడుకలలో పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి, విడపనకల్లు





అశేష భక్తుల నడుమ సాగుతున్న రథోత్సవం, కొలువుదీరిన స్వామివారు

సమస్యలను పరిష్కరించండి

● ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

రొళ్ల, జూలై 12(ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అధికారులను ఆదేశించారు. రొళ్ల మండల కేంద్రంలోని హెచ్ ఎంపల్లి, వడ్రహట్టిగ్రామాల్లో సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన, చేపట్టనున్న పథకాలను వివరించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా..? లేదా..? అని వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వెంటనే వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులతో క్రికెట్ ఆడారు. రొళ్ల ఎస్సీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ, వాల్మీకి గంగాధరప్ప, ఈర్షాద్, 50 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఎమ్మెల్యే వీరికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్ ఈరన్న, మార్కెట్‌యార్డ్ చైర్మన్ గురుమూర్తి, వక్కళిగ కన్వీనర్ పాండురంగప్ప, సింగిల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి, మాజీ జడ్పీటీసీ సన్నతిమ్మప్ప, టీడీపీ కార్యదర్శి ఉగ్రేగౌడ్, కోఆర్డినేటర్ రామక్రిష్ణ, క్లస్టర్ ఇన్‌చార్జి మారుతి ప్రసాద్, నియోజకవర్గ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తి, ఎస్టీసెల్ అధ్యక్షులు హనుమంతనాయక్, నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

మడకశిరలో..



మడకశిర టౌన్, (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ పట్టణ అధ్యక్షుడు నాగరాజు అన్నారు. పేదలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు. శనివారం పట్టణంలోని ఓల్డ్ ఎస్సీకాలనీ, 18వ వార్డులలో సుపరిపాలనకు తొలిఅడుగు నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ మాజీ చైర్మన్ సుబ్బరాయుడు, కౌన్సిలర్లు సుభద్ర, నాగేంద్ర, జనరల్ సెక్రెటరీ తిమ్మరాజు, నాయకులు బుల్లెట్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

లోచర్ల గ్రామంలో..



రొద్దం, (ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం జరుగుతుందని టీడీపీ నాయకుడు మాధవనాయుడు తెలిపారు. మండలంలోని లోచర్ల గ్రామంలో సుపరిపాలనకు తొలి అడుగు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. త్వరలోనే మహిళల ఖాతాల్లో రూ. 1500 జమచేయడం జరుగుతుందన్నారు. అనంతరం రోడ్డు ప్రమాదంలో గాయపడిన టీడీపీ కార్యకర్త శ్రీరాములును పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు చిన్నప్పయ్య, రామక్రిష్టప్ప, వెంకటరామిరెడ్డి, నరహరి, పుల్లప్ప పాల్గొన్నారు.
మాజీ సర్పంచ్‌కు పరామర్శ: కంచిసముద్రం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ హనుమంతరాయుడు అనారోగ్యంతో బాధపడుతుండగా టీడీపీ నాయకుడు మాధవనాయుడు పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

శెట్టిపల్లిలో..



పెనుకొండ రూరల్, (ఆంధ్రజ్యోతి): శెట్టిపల్లి, రాంపురం, మరువపల్లి, కొండంపల్లి తదితర గ్రామాల్లో టీడీపీ నాయకులు సుపరిపాలనకు తొలిఅడుగు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రాలను అందించి సంక్షేమ పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు శ్రీరాములుయాదవ్, ఈశ్వరప్రసాద్, చిన్నవెంకటరాముడు, మాజీ జడ్పీటీసీ నారాయణస్వామి, మాజీ ఎంపీపీ కేశవయ్య పాల్గొన్నారు.

సోమందేపల్లిలో..



సోమందేపల్లి, (ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకులు ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. పందిపర్తి, సోమందేపల్లిలోని పలు వార్డుల్లో నాయకులు తల్లికివందనం, ఉచిత బస్సు ప్రయాణం తదతర పథకాలను వివరించారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చారిజులు మద్దిలేటి, రమేష్‌యాదవ్, కన్వీనర్ కిష్టప్ప, మాజీ ఎంపీటీసీ మూర్తి, టీడీపీ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, బాబాచారి, ఆంజనేయులు, మారుతి పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

పెనుకొండ, జూలై 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎగువగడ్డ వీధిలో అరుణ ఉంటున్నారు. జూన్‌లో అరుణ భర్త నాగరాజు, రెండు రోజుల వ్యవధిలోనే అత్త ముత్యాలమ్మ మృతిచెందారు. దీంతో అమ్మమ్మను, మానసిక వికలాంగుడైన కుమారుడి పోషణభారం అరుణపై పడింది. దీంతో ఆమె ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో బహుజన చైతన్యవేదిక వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది శివరామక్రిష్ణ శనివారం ఆ కుటుంబానికి నిత్యావసరాలు అందించి ఆర్థికసాయం అందించారు. తనకు పెన్షన్ సదుపాయం కల్పించాలని, ఇల్లు మంజూరు చేయాలని మంత్రి సవితను ఈ సందర్భంగా కోరారు. కార్యక్రమంలో చైతన్యవేదిక సభ్యులు బాబుప్రసాద్, రవికుమార్, కొల్లప్ప పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక అలంకరణ



నల్లచెరువు, జూలై 12(ఆంధ్రజ్యోతి): పాలపాటి ఆంజనేయస్వామికి అర్చకులు శనివారం ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. స్వామిమూలవిరాట్‌కు అభిషేకాలు, అర్చనలు నిర్వహించి, తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ఉచిత భోజన వసతి కల్పించారు.